manavishwam.com

# మన విశ్వం

VOICE OF THE PEOPLE-POWER OF TRUTH

తెలుగు వార్తా దినపత్రిక

MANA VISHWAM TELUGU DAILY

వరంగల్ | సంపుటి : 01 | సంచిక : 100 | శనివారం 26 సెప్టెంబరు 2026 | పేజీలు : 8 | వెల : రూ.5 | PRGI, NO : TGTEL/26/A4450 | ఎడిటర్ : నమిండ్ల ప్రమోద్



మీ కలానికి.. ఇదే వేదిక!

మన విశ్వం

జిల్లా ప్రతినిధులు

నియోజకవర్గ రిపోర్టర్లు

కావలెను

వార్త మీ బలం అయితే.. 'మన విశ్వం' మీ వేదిక!

630 563 8569

900 096 7680




# గణనాథుడికి.. ఘన వీడ్కోలు!

## భాగ్యనగరమంతా మార్మోగిన గణేశ్ నామస్మరణ

- హుస్సేన్‌సాగర్ వైపు భారీ శోభాయాత్రలు
- డప్పుల మోత.. నృత్యాలు.. భక్తుల కోలాహలం
- ఖైరతాబాద్ 69 అడుగుల మహాగణపతి నిమజ్జనం
- బాలాపూర్ నుంచి ట్యాంక్‌బండ్ వరకు జనసంద్రం
- 20 వేల మందికిపైగా పోలీసులతో భారీ బందోబస్తు
- 10 వేలకుపైగా సీసీ కెమెరాలు.. 24 డ్రోన్లతో నిఘా

**హైదరాబాద్, సెప్టెంబర్ 25 (మన విశ్వం):** "గణపతి బప్పా మోరియా.. మళ్లీ వచ్చే ఏడాది రా బప్పా.." అంటూ భక్తుల జయజయధ్వానాలతో భాగ్యనగరం మార్మోగింది. నవరాత్రుల పాటు పూజలందుకున్న గణనాథులు శుక్రవారం భారీ శోభాయాత్రల నడుమ నిమజ్జనానికి తరలారు. డప్పుల మోతలు, నృత్యాలు, గణేశ్ నామస్మరణతో ప్రధాన రహదారులు భక్తజన సంద్రంగా మారాయి. హుస్సేన్‌సాగర్ పరిసరాలు భక్తుల కోలాహలంతో కిక్కిరి శాయి. నిమజ్జనోత్సవంలో ప్రధాన ఆకర్షణగా నిలిచిన ఖైరతాబాద్ 69 అడుగుల మహాగ ణపతికి భక్తులు ఘనంగా వీడ్కోలు పలికారు. సాంకేతిక కారణాలతో

మిగతా 2లో..

- కాంగ్రెస్‌కు పాలనపై ప్రజల స్పందనే కీలకం
- పట్టు తిరిగి సాధించేందుకు బీఆర్ఎస్ కసరత్తు
- క్షేత్రస్థాయి విస్తరణపై బీజేపీ గురి
- ఖైరతాబాద్‌తో మొదలు.. ముందున్న వరుస ఎన్నికల పోరులు
- స్థానిక సంస్థలు, నగర పాలక సంస్థలు, పట్టభద్రుల ఎమ్మెల్సీలపైనా కన్ను
- గ్రామం నుంచి గ్రేటర్ వరకు వేడెక్కనున్న తెలంగాణ రాజకీయం



# మూడు పార్టీలకు ముమ్ముందు అసలు పరీక్ష!

**తెలంగాణ బ్యూరో, సెప్టెంబర్ 25 (మన విశ్వం):** తెలంగాణలో మూడు ప్రధాన పార్టీలకు ముమ్ముందు వరుస రాజకీయ పరీక్షలు ఎదురుకానున్నాయి. అధికార కాంగ్రెస్, ప్రధాన ప్రతిపక్ష బీఆర్ఎస్, బీజేపీ క్షేత్రస్థాయి బలాన్ని చాటుకునేందుకు వ్యూహాలు సిద్ధం చేస్తున్నాయి. దానం నాగేందర్ అనర్హతను సుప్రీంకోర్టు సమర్థించడంతో ఖైరతాబాద్ అసెంబ్లీ స్థానం ఖాళీ కావడం రాష్ట్ర రాజకీయాల్లో మరో కీలక పోరుకు తెరతీసింది. దీనికి తోడు ఎంపీటీసీ–జెడ్పీటీసీ ఎన్నికలు, హైదరాబాద్ ప్రాంతంలోని నగర పాలక సంస్థల ఎన్నికలతోపాటు గ్రేటర్ వరంగల్, ఖమ్మం, సిద్దిపేట మున్సిపల్ కార్పొరేషన్‌లు, పట్టభద్రుల ఎమ్మెల్సీ స్థానాల పోరు ముందుండటంతో గ్రామం నుంచి గ్రేటర్ వరకు రాజకీయ వేడి మరింత పెరగనుంది.

**తొలి సమరం.. ఖైరతాబాద్!**

2023లో బీఆర్ఎస్ అభ్యర్థిగా ఖైరతాబాద్ నుంచి గెలిచిన దానం నాగేందర్ అనంతరం కాంగ్రెస్‌లో చేరి, 2024 లోక్‌సభ ఎన్నికల్లో ఆ పార్టీ తరఫున సికింద్రాబాద్ నుంచి పోటీ చేశారు. ఈ వ్యవహారంలో ఆయనపై పడిన అనర్హత వేటును సుప్రీంకోర్టు సమర్థించింది. దీంతో ఖైరతాబాద్‌లో తాజా ఎన్నికకు మార్గం ఏర్పడింది. ఎన్నికల షెడ్యూల్ ఇంకా రావాల్సి ఉన్నప్పటికీ కాంగ్రెస్, బీఆర్ఎస్, బీజేపీల దృష్టి ఈ స్థానంపై పడింది.


**కాంగ్రెస్‌కు.. పాలనపై పరీక్ష**

అధికార కాంగ్రెస్‌కు ముందున్న ఎన్నికలు ప్రభుత్వ పాలన, సంక్షేమ కార్యక్రమాలు, ఎన్నికల హామీల అమలుపై వివిధ వర్గాల స్పందనను తెలుసుకునే రాజకీయ వేదికలుగా మారనున్నాయి. ఖైరతాబాద్‌తో పాటు గ్రామీణ

మిగతా 2లో..

# సీఈసీపై.. కాంగ్రెస్–బీజేపీ ఢీ!

- జ్ఞానేశ్‌కుమార్ తప్పుకోవాలంటూ కాంగ్రెస్ డిమాండ్
- 10 నెలల్లో 14 సందర్భాల్లో అభ్యంతరాలన్న 'ఇండియన్ ఎక్స్‌ప్రెస్' కథనం
- ఎస్ఐఆర్ ప్రక్రియ చట్టబద్ధమేనంటూ బీజేపీ కౌంటర్
- 'తుది నిర్ణయాలు ఏకగ్రీవంగానే' అంటున్న ఎన్నికల సంఘం
- ఎన్డీఏ మిత్రపక్షాల నుంచీ 'ఈసీ స్పష్టత ఇవ్వాలి' అన్న స్వరం



**న్యూఢిల్లీ, సెప్టెంబర్ 25 (మన విశ్వం):** ప్రధాన ఎన్నికల కమిషనర్ జ్ఞానేశ్‌కుమార్ చుట్టూ రాజుకున్న వివాదం కాంగ్రెస్––బీజేపీ మధ్య రాజకీయ పోరుగా మారింది. ఎన్నికల కమిషనర్లు సుఖ్‌బీర్‌సింగ్ సంధు, వివేక్ జోషి గత పది నెలల్లో కనీసం 14 సందర్భాల్లో ఎన్నికల సంఘం చేపట్టిన పలు చర్యలపై రికార్డుల్లో అభ్యంతరాలు వ్యక్తం చేసినట్లు 'ఇండియన్ ఎక్స్‌ప్రెస్' దర్యాప్తు కథనం వెల్లడించింది. దీంతో జ్ఞానేశ్‌కుమార్ పదవి నుంచి

మిగతా 2లో..



## 92.87 లక్షల ఓటర్లకు.. పత్రాల పరీక్ష!

- నోటీసులు అందుకున్నవారు ఆధారాలు సమర్పించాలి
- ఓటర్లకు ప్రధాన ఎన్నికల అధికారి సుదర్శన్‌రెడ్డి కీలక సూచన
- వివరాల వ్యత్యాసాలు, పాత జాబితాతో అనుసంధానం కాకపోవడంపై నోటీసులు
- నోటీసు వచ్చిందంటే ఓటు తొలగినట్లు కాదని స్పష్టత
- అక్టోబర్ 7 వరకు దరఖాస్తులు, అభ్యంతరాలకు అవకాశం
- నవంబర్ 9న తుది ఓటరు జాబితా

వివరాలు 2లో..

# నా చివరి లక్ష్యం.. రాహుల్‌ను ప్రధాని చేయడమే!





- ఇక వ్యక్తిగత రాజకీయ ఆశయాలేమీ లేవు : సీఎం రేవంత్‌రెడ్డి
- కేంద్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పాటే లక్ష్యమని వెల్లడి
- దేశంలో సిద్ధాంతపరమైన రాజకీయ పోరు సాగుతోందని వ్యాఖ్య
- కేరళ నుంచి మొదలైన రాజకీయ మార్పు దేశవ్యాప్తంగా విస్తరిస్తుందని ధీమా
- ఆర్యదాన్ ముహమ్మద్ స్మారక పురస్కారం అందుకున్న తెలంగాణ సీఎం

వివరాలు 2లో..



# ఆర్టీసీ ఎన్నికల్లో.. టిడబ్ల్యూయూకే కాంగ్రెస్ జై!

- అక్టోబర్ 9న గుర్తింపు సంఘం ఎన్నికలు
- వర్కర్స్ యూనియన్‌కు సంపూర్ణ మద్దతు ప్రకటించిన టీపీసీసీ
- డీసీసీ, సిటీ అధ్యక్షులు, ఎమ్మెల్యేలకు మహేష్‌కుమార్‌గౌడ్ స్పష్టమైన సూచనలు
- ఇతర యూనియన్లను ప్రోత్సహించొద్దంటూ పార్టీ శ్రేణులకు ఆదేశం
- ఎన్నికల సమన్వయ బాధ్యతలు బొంతు రామ్మోహన్‌కు

**హైదరాబాద్, సెప్టెంబర్ 25 (మన విశ్వం):** తెలంగాణ ఆర్టీసీలో పదేళ్ల తర్వాత జరుగుతున్న గుర్తింపు సంఘం ఎన్నికల వేళ కాంగ్రెస్ తన వైఖరిని స్పష్టం చేసింది. అక్టోబర్ 9న జరగనున్న ఎన్నికల్లో తెలంగాణ ఆర్టీసీ వర్కర్స్ యూనియన్ (టిడబ్ల్యూయూ)కు సంపూర్ణ మద్దతు ప్రకటించింది. యూనియన్ విజయానికి పార్టీ శ్రేణులు క్షేత్రస్థాయిలో పనిచేయాలని టీపీసీసీ అధ్యక్షుడు బి. మహేష్‌కుమార్‌గౌడ్ సూచించారు. దీంతో ఆర్టీసీ కార్మిక సంఘాల ఎన్నికల పోరు మరింత ఆసక్తికరంగా మారింది. టిడబ్ల్యూయూ కాంగ్రెస్‌కు అనుబంధంగా పనిచేస్తున్న యూనియన్ అని పేర్కొన్న మహేష్‌కుమార్‌గౌడ్.. రాష్ట్రంలోని డీసీసీ, సిటీ కాంగ్రెస్ అధ్యక్షులు, ఎమ్మెల్యేలు తమ పరిధిలోని ఆర్టీసీ డిపోల వద్ద యూనియన్‌కు పూర్తి సహకారం అందించాలని సూచించారు. ఇతర యూనియన్లను ప్రోత్సహించవద్దని స్పష్టం చేశారు. పార్టీ నాయకులు, కార్యకర్తలు టిడబ్ల్యూయూ ప్రతినిధులతో సమన్వయం చేసుకుని ఎన్నికల్లో పనిచేయాలని కోరారు.

**బొంతుకు కీలక బాధ్యత**

గుర్తింపు సంఘం ఎన్నికల సమన్వయ బాధ్యతలను టీపీసీసీ ఉపాధ్యక్షుడు, గ్రేటర్ హైదరాబాద్ మాజీ మేయర్ బొంతు రామ్మోహన్‌కు అప్పగించారు. రాష్ట్రవ్యాప్తంగా

మిగతా 2లో..

# గోదావరి పొంగుతోంది.. నీళ్లు ఎత్తరేం?

- వరద జలాలను జలాశయాలకు తరలించండి: హరీశ్‌రావు
- కాళేశ్వరం పరిధిలో 141 టీఎంసీల నిల్వ సామర్థ్యం ఉందని వెల్లడి
- మల్లన్నసాగర్‌లో 13టీఎంసీలే.. కొండపోచమ్మలో 6టీఎంసీలేనని లేఖలో ప్రస్తావన
- ఎల్లంపల్లి నుంచి వరుస జలాశయాలను నింపాలని డిమాండ్
- ఐదు లక్షల ఎకరాలకు సాగునీరు అందించే అవకాశముందని వాదన
- మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డికి మూడు పేజీల లేఖ



**తెలంగాణ బ్యూరో, సెప్టెంబర్ 25 (మన విశ్వం):** గోదావరిలో వరద ప్రవాహం కొనసాగుతున్నా ఆ నీటిని ఒడిసిపట్టి జలాశయాలను ఎందుకు నింపడం లేదని బీఆర్ఎస్ శాసనసభాపక్ష ఉపనేత, మాజీ మంత్రి తన్నీరు హరీశ్‌రావు రాష్ట్ర ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. అందుబాటులో ఉన్న ఎత్తిపోతల పథకాల పంపులను నడిపించి వరద జలాలను జలాశయాలకు తరలించాలని నీటిపారుదల శాఖ మంత్రి ఎన్.ఉత్తమ్‌కుమార్‌రెడ్డిని కోరారు. ఈ మేరకు ఆయన మూడు పేజీల లేఖ రాశారు. గోదావరిలో నీరు అందుబాటులో ఉన్నప్పుడే వినియోగించుకుని రైతులకు సాగునీటి భరోసా కల్పించాలని డిమాండ్ చేశారు. కాళేశ్వరం ప్రాజెక్టులో భాగంగా 141 టీఎంసీల నిల్వ సామర్థ్యంతో జలాశయాలను నిర్మించారని హరీశ్‌రావు పేర్కొన్నారు. వరద ప్రవాహం ఉన్నప్పటికీ ఆ నీటిని ఎత్తిపోసి జలాశయాలను నింపడంలో

మిగతా 2లో..

మన విశ్వం
VOICE OF THE PEOPLE-POWER OF TRUTH

# కుటుంబ ప్రణాళికే.. ఆరోగ్య సమాజానికి పునాది



కుటుంబం చిన్నదా.. పెద్దదా అన్నది కాదు ముఖ్యం. ఆ కుటుంబంలోని ప్రతి ఒక్కరికీ ఆరోగ్యం, విద్య, పోషణ, భద్రతతో కూడిన జీవితం అందుతోందా అన్నదే అసలు ప్రశ్న. పిల్లలను కనడం ఎంత సహజమైన నిర్ణయమో.. ఎప్పుడు కనాలి, ఎంత విరామం ఉండాలి, వారి భవిష్యత్తుకు ఎలాంటి భరోసా ఇవ్వగలం అని ఆలోచించడం అంతే బాధ్యతాయుతమైన నిర్ణయం. సెప్టెంబర్ 26న నిర్వహించే ప్రపంచ గర్భనిరోధక అవగాహన దినం సమాజానికి గుర్తుచేసే సందేశం కూడా ఇదే.

కుటుంబ నియంత్రణను కేవలం జనాభా లెక్కల కోణంలో చూడటం సరికాదు. దీని వెనుక తల్లి ఆరోగ్యం ఉంది.. శిశువు సంక్షేమం ఉంది.. కుటుంబ ఆర్థిక స్థిరత్వం ఉంది. వరుస గర్భధారణలు తల్లి ఆరోగ్యంపై ప్రభావం చూపే అవకాశం ఉంటుంది. పిల్లల మధ్య తగిన విరామం లేకపోతే వారి పోషణ, సంరక్షణ, విద్యపై కూడా కుటుంబానికి అదనపు భారం పడుతుంది. అందుకే కుటుంబ ప్రణాళిక అనేది సంఖ్యల వ్యవహారం కాదు.. జీవన ప్రమాణాలకు సంబంధించిన అంశం.

కుటుంబ నియంత్రణ అంటే మహిళల బాధ్యత మాత్రమే అన్న భావన కూడా మారాలి. సంతానం విషయంలో నిర్ణయం భార్యాభర్తలిద్దరిదీ. బాధ్యత కూడా ఇద్దరిదే. మహిళ ఆరోగ్యం, కుటుంబ ఆర్థిక పరిస్థితి, పిల్లల భవిష్యత్తును దృష్టిలో పెట్టుకుని పరస్పర అవగాహనతో నిర్ణయాలు తీసుకునే సంస్కృతి పెరగాలి. అవసరమైనప్పుడు వైద్య నిపుణుల సలహా తీసుకోవాలి.

అయితే అవగాహనకు ఇప్పటికీ అపోహలే ప్రధాన అడ్డంకి. ముఖ్యంగా గ్రామీణ ప్రాంతాల్లో సంతానోత్పత్తి ఆరోగ్యం, గర్భనిరోధక పద్ధతులపై శాస్త్రీయ సమాచారం మరింత విస్తృతంగా చేరాల్సిన అవసరం ఉంది. ప్రభుత్వ ఆసుపత్రులు, ఆరోగ్య కేంద్రాలు, ఆశా కార్యకర్తల ద్వారా సేవలను ప్రతి కుటుంబం వరకు తీసుకెళ్లాలి. యువతకు కూడా బాధ్యతాయుత కుటుంబ జీవనం, సంతానోత్పత్తి ఆరోగ్యంపై సరైన అవగాహన కల్పించాలి.


పెరుగుతున్న జనాభాతో పాటు ఆహారం, నివాసం, విద్య, వైద్యం, ఉపాధి వంటి మౌలిక అవసరాలపై ఒత్తిడి పెరుగుతుంది. పరిమిత ఆదాయంతో కుటుంబ అవసరాలను తీర్చడం కూడా సవాలుగా మారుతుంది. అందుకే కుటుంబ ప్రణాళిక వ్యక్తిగత సంక్షేమంతో ముగిసిపోయే అంశం కాదు. ఆరోగ్యవంతమైన కుటుంబాలు, మెరుగైన జీవన ప్రమాణాలు, సమతుల్యమైన సామాజిక అభివృద్ధితోనూ దీనికి సంబంధం ఉంది.

కుటుంబ నియంత్రణ అంటే ఆంక్ష కాదు.. అవగాహనతో తీసుకునే స్వచ్ఛంద నిర్ణయం. ఎంతమంది పిల్లలు ఉండాలన్న నిర్ణయం దంపతులదే. కానీ ఆ నిర్ణయం సరైన సమాచారం, ఆరోగ్యంపై అవగాహన, భవిష్యత్తుపై బాధ్యతతో ఉండాలి. ప్రతి తల్లి ఆరోగ్యంగా ఉండాలి.. ప్రతి శిశువుకు సరైన పోషణ అందాలి.. ప్రతి బిడ్డకు చదువు, భద్రత, మంచి భవిష్యత్తు దక్కాలి.

ఆరోగ్యకరమైన కుటుంబాలే ఆరోగ్యకరమైన సమాజాన్ని నిర్మిస్తాయి. ఆ కుటుంబాలకు పునాది అవగాహన.. ఆ అవగాహనకు బలం బాధ్యతాయుతమైన కుటుంబ ప్రణాళిక.

**- నమిండ్ల. ప్రమోద్, ఎడిటర్**

# గణనాథుడికి.. ఘన వీడ్కోలు!



**(మొదటిపేజీ తరువాయి)**

ఆలస్యంగా ప్రారంభమైన శోభాయాత్ర రాజ్‌దూత్ కూడలి, టెలిఫోన్ భవన్, ఇక్బాల్ మినార్, తెలంగాణ తల్లి కూడలి మీదుగా ఎన్టీఆర్ మార్గ్‌కు చేరింది. అనంతరం మహాగణపతిని హుస్సేన్‌సాగర్‌లో నిమజ్జనం చేశారు. మార్గమంతా భారీగా తరలివచ్చిన భక్తులు బడా గణేశుడిని దర్శించుకున్నారు.

**బాలాపూర్ నుంచి ట్యాంక్‌బండ్ దాకా..**

బాలాపూర్ గణేశుడి శోభాయాత్ర కూడా ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. బాలాపూర్ నుంచి చాంద్రాయణగుట్ట, ఫలక్‌నుమా, చార్మినార్, అఫ్జల్‌గంజ్, ఎంజే మార్కెట్, అబిడ్స్ మీదుగా ట్యాంక్‌బండ్ వైపు యాత్ర సాగింది. మరోవైపు నగరంలోని వివిధ ప్రాంతాల నుంచి వేలాది గణేశ్ విగ్రహాలు నిమజ్జన కేంద్రాలకు తరలివచ్చాయి. ప్రధాన మార్గాలు గణపతి నామస్మరణతో మార్మోగాయి.

**అడుగడుగునా నిఘా**

నిమజ్జనం నేపథ్యంలో పోలీసులు భారీ భద్రతా ఏర్పాట్లు చేశారు. 20 వేల మందికిపైగా పోలీసు సిబ్బందిని మోహరించడంతో పాటు 10 వేలకుపైగా సీసీ కెమెరాలు, 24 డ్రోన్లతో శోభాయాత్రలను పర్యవేక్షించారు. హుస్సేన్‌సాగర్‌తో పాటు ప్రధాన నిమజ్జన కేంద్రాల్లో క్రేన్లు, గజ ఈతగాళ్లు, రక్షణ బృందాలు, వైద్య సిబ్బందిని సిద్ధంగా ఉంచారు. ట్రాఫిక్ మళ్లింపులు చేపట్టి ప్రధాన మార్గాల్లో ప్రత్యేక బందోబస్తు ఏర్పాటు చేశారు. భక్తుల సందడి.. డప్పుల మోత.. గణపతి బప్పా మోరియా నినాదాల మధ్య మహానగరం గణేశ్ ఉత్సవాలకు ఘనంగా వీడ్కోలు పలికింది.

# మూడు పార్టీలకు.. ముున్ముందు అసలు పరీక్ష!

**(మొదటిపేజీ తరువాయి)**

స్థానిక సంస్థలు, హైదరాబాద్ నగర పాలక సంస్థల పోరు, గ్రేటర్ వరంగల్, ఖమ్మం సిద్దిపేట కార్పొరేషన్ లలో తన క్షేత్రస్థాయి పట్టును నిలబెట్టుకోవడం ఆ పార్టీ ముందున్న కీలక సవాల్.

**బీఆర్ఎస్‌కు.. పట్టు కోసం పోరు**

అధికారం కోల్పోయిన తర్వాత బీఆర్ఎస్‌కు ముందున్న ఎన్నికలు సంస్థాగత బలాన్ని మరోసారి ప్రదర్శించే అవకాశంగా మారనున్నాయి. దానం అనర్హత కోసం న్యాయపోరాటం చేసిన నేపథ్యంలో ఖైరతాబాద్‌పై ఆ పార్టీ ప్రత్యేక దృష్టి పెట్టింది. గ్రామీణ ప్రాంతాల్లో కేడర్‌ను క్రియాశీలం చేయడం, హైదరాబాద్‌లో తన పట్టును నిలబెట్టుకోవడంతో పాటు గ్రేటర్ వరంగల్, ఖమ్మం, సిద్దిపేట కార్పొరేషన్ లు,పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికలపైనా బీఆర్ఎస్ దృష్టి సారిస్తోంది.

**బీజేపీకి.. విస్తరణపై గురి**

బీజేపీకి పార్లమెంట్ ఎన్నికల్లో వచ్చిన మద్దతును క్షేత్రస్థాయికి విస్తరించడం ప్రధాన లక్ష్యంగా కనిపిస్తోంది. ఖైరతాబాద్‌ను బీజేపీ 2014లో గెలుచుకోగా, 2024 సికింద్రాబాద్ లోక్‌సభ ఎన్నికల్లో ఖైరతాబాద్ అసెంబ్లీ సెగ్మెంట్‌లో బీజేపీ అభ్యర్థి జి.కిషన్‌రెడ్డికి సుమారు 17 వేల ఓట్ల ఆధిక్యం లభించినట్లు సమాచారం. దీంతో ఖైరతాబాద్‌తో పాటు నగర పాలక సంస్థలు, పట్టభద్రుల ఎమ్మెల్సీ పోరుపైనా కమలం పార్టీ దృష్టి సారిస్తోంది.

**గ్రామం నుంచి గ్రేటర్ వరకు..**

ఎంపీటీసీ-జెడ్పీటీసీ ఎన్నికలు గ్రామీణ క్షేత్రబలాన్ని పరీక్షిస్తే.. ఖైరతాబాద్ పోరు హైదరాబాద్‌లో మూడు పార్టీల పట్టుకు పరీక్షగా మారనుంది. నగర పాలక సంస్థల ఎన్నికలు మహానగర రాజకీయ సమీకరణాలను పరీక్షించనుండగా, పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికలు మరో ప్రత్యేక ఓటరు వర్గంలో పార్టీల సంస్థాగత బలాన్ని పరీక్షించనున్నాయి. ఒక్కో ఎన్నికలో స్థానిక సమస్యలు, అభ్యర్థులు, సామాజిక సమీకరణాలు కీలకంగా మారనున్న నేపథ్యంలో- కాంగ్రెస్, బీఆర్ఎస్, బీజేపీలకు ముున్ముందు వరుస రాజకీయ పరీక్షలే ఎదురుకానున్నాయి.

## ఆర్టీసీ ఎన్నికల్లో.. టిడబ్ల్యూయూకే కాంగ్రెస్ జై!

**(మొదటిపేజీ తరువాయి)**

పార్టీ శ్రేణులు, టిడబ్ల్యూయూ ప్రతినిధుల మధ్య సమన్వయం చేస్తూ ఎన్నికల కార్యాచరణను ఆయన పర్యవేక్షించనున్నారు. ఆర్టీసీలో ఏ కార్మిక సంఘానికి ఉద్యోగుల మద్దతు ఉందో తేల్చే గుర్తింపు సంఘం ఎన్నికలు కావడంతో అక్టోబర్ 9 పోలింగ్‌పై ఆసక్తి నెలకొంది. ఈ నేపథ్యంలో అధికార కాంగ్రెస్ నేరుగా టిడబ్ల్యూయూకు మద్దతు ప్రకటించి పార్టీ యంత్రాంగాన్ని రంగంలోకి దింపాలని నిర్ణయించడం ఎన్నికల పోరుకు రాజకీయ ప్రాధాన్యాన్ని తీసుకొచ్చింది.



# గోదావరి పొంగుతోంది.. నీళ్లు ఎత్తరేం?

**(మొదటిపేజీ తరువాయి)**

ప్రభుత్వం నిర్లక్ష్యం వహిస్తోందని ఆరోపించారు. ఎల్లంపల్లి నుంచి మిడ్‌మానేరు, అన్నపూర్ణ, రంగనాయకసాగర్, మల్లన్నసాగర్, కొండపోచమ్మసాగర్, గంధమల్ల, బస్వాపూర్ వరకు నీటిని తరలించే అవకాశాలను వినియోగించుకోవాలని కోరారు. మల్లన్నసాగర్ 50 టీఎంసీల సామర్థ్యానికి ప్రస్తుతం 13 టీఎంసీల నీరు మాత్రమే ఉందని, కొండపోచమ్మసాగర్‌లో 15 టీఎంసీలకు 6 టీఎంసీలే ఉన్నాయని లేఖలో పేర్కొన్నారు. ఇప్పటికైనా నీటిని ఎత్తిపోస్తే యాదాద్రి భువనగిరి జిల్లాలోని బస్వాపూర్, గంధమల్ల జలాశయాలకూ ప్రయోజనం చేకూరుతుందని తెలిపారు. ఎల్లంపల్లి నుంచి వరుసగా జలాశయాలను నింపితే దాదాపు ఐదు లక్షల




ఎకరాలకు సాగునీరు అందించే అవకాశం ఉంటుందని హరీశ్‌రావు పేర్కొన్నారు. పెద్దపల్లి, కరీంనగర్, రాజన్న సిరిసిల్ల, సిద్దిపేట, మెదక్, యాదాద్రి భువనగిరి, మేడ్చల్-- మల్కాజిగిరి, హైదరాబాద్ జిల్లాల్లో రైతులు, ప్రజలకు ప్రయోజనం కలుగుతుందని వివరించారు. లోయర్ మానేరు జలాశయంలో ప్రస్తుతం 11 టీఎంసీల నీరే ఉందని పేర్కొంటూ కరీంనగర్, వరంగల్ ఉమ్మడి జిల్లాల సాగు అవసరాలను దృష్టిలో పెట్టుకోవాలని కోరారు. హైదరాబాద్ తాగునీటి అవసరాలతో పాటు మూసీ పునరుజ్జీవనానికి గోదావరి జలాలను వినియోగించే ప్రణాళిక ఉన్నందున రంగనాయకసాగర్ నుంచి నీటిని తరలించే ఏర్పాట్లను వేగవంతం చేయాలని సూచించారు. మేడిగడ్డ పరిస్థితిని కారణంగా చూపి గోదావరి వరద జలాలను వినియోగించుకునే అవకాశాన్ని వదులుకోవద్దని హరీశ్‌రావు కోరారు. "ఇప్పటికైనా కళ్లు తెరవండి.. చేతులు కాలాక ఆకులు పట్టుకుంటే ఏం లాభం?" అంటూ ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. అందుబాటులో ఉన్న పంపులను 24 గంటలూ నడిపించి జలాశయాలను నింపాలని, రైతులకు సాగునీటి భరోసా కల్పించాలని మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డిని కోరారు.

# నా చివరి లక్ష్యం.. రాహుల్‌ను ప్రధాని చేయడమే!

- ఇక వ్యక్తిగత రాజకీయ ఆశయాలేమీ లేవు : సీఎం రేవంత్‌రెడ్డి
- కేంద్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పాటే లక్ష్యమని వెల్లడి
- దేశంలో సిద్ధాంతపరమైన రాజకీయ పోరు సాగుతోందని వ్యాఖ్య
- కేరళ నుంచి మొదలైన రాజకీయ మార్పు దేశవ్యాప్తంగా విస్తరిస్తుందని ధీమా
- ఆర్యదాన్ ముహమ్మద్ స్మారక పురస్కారం అందుకున్న తెలంగాణ సీఎం



తెలంగాణ బ్యూరో, సెప్టెంబర్ 25 (మన విశ్వం): "నాకు ఇక వ్యక్తిగత రాజకీయ ఆశయాలేమీ లేవు. కేంద్రంలో కాంగ్రెస్ నేతృత్వంలోని ప్రభుత్వం ఏర్పడి, రాహుల్‌గాంధీ ప్రధానమంత్రి కావడమే నా చివరి లక్ష్యం" అని ముఖ్యమంత్రి ఎ.రేవంత్‌రెడ్డి ప్రకటించారు. కేరళలో శుక్రవారం ఆర్యదాన్ ముహమ్మద్ స్మారక పురస్కారం అందుకున్న అనంతరం జరిగిన కార్యక్రమంలో ఆయన జాతీయ రాజకీయాలపై కీలక వ్యాఖ్యలు చేశారు. 2006లో క్షేత్రస్థాయి కార్యకర్తగా తన రాజకీయ ప్రయాణం ప్రారంభమైందని రేవంత్ గుర్తుచేశారు. గత రెండు దశాబ్దాల్లో జడ్పీటీసీ సభ్యుడు, ఎమ్మెల్సీ, ఎమ్మెల్యే, ఎంపీ, టీపీసీసీ అధ్యక్షుడు నుంచి ముఖ్యమంత్రి వరకు వివిధ బాధ్యతలు నిర్వర్తించానన్నారు. ఇక తనకు వ్యక్తిగతంగా సాధించాల్సిన రాజకీయ పదవులపై ఆశ లేదని, రాజ్యాంగం, ప్రజాస్వామ్యం, లౌకిక విలువల పరిరక్షణ కోసం కేంద్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం రావాలని ఆకాంక్షిస్తున్నట్లు చెప్పారు. దేశ భవిష్యత్తు కోసం జరుగుతున్న రాజకీయ పోరు రెండు భిన్న సిద్ధాంతాల మధ్య సాగుతోందని రేవంత్ పేర్కొన్నారు. గాంధీ కుటుంబం దేశం కోసం త్యాగాలు చేసిందని చెబుతూ, సంఘ్ పరివార్‌పై విమర్శలు చేశారు. మతం, కులం, ప్రాంతం, భాష పేరుతో దేశాన్ని విభజించే ప్రయత్నాలు జరుగుతున్నాయని ఆరోపించారు.

**కేరళ నుంచే మార్పు మొదలు!**

దేశ రాజకీయాలకు కేరళ ఒక సూచిక వంటిదని రేవంత్ వ్యాఖ్యానించారు. నైరుతి రుతుపవనాల రాకను తెలుసుకునేందుకు దేశం కేరళ వైపు చూసినట్లే, జాతీయ రాజకీయాల దిశను అంచనా వేయడానికి కూడా కేరళను గమనించాలన్నారు. 2026లో కేరళ నుంచి మొదలైన రాజకీయ మార్పు దేశవ్యాప్తంగా విస్తరిస్తుందని, కేంద్రంలో కాంగ్రెస్‌ను అధికారంలోకి తీసుకొస్తుందని ఆయన ధీమా వ్యక్తం చేశారు. బీజేపీ నేతృత్వంలోని కేంద్ర ప్రభుత్వంపైనా రేవంత్ విమర్శలు చేశారు. ఓట్లు, రాజకీయ పార్టీలు, ఎన్నికల గుర్తులు, ప్రజాధనం విషయంలో అక్రమాలు జరుగుతున్నాయని ఆరోపించారు. యువత భవిష్యత్తును కాపాడేందుకు ప్రజాస్వామ్య, రాజ్యాంగ విలువల పరిరక్షణకు అందరూ కలిసిరావాలని పిలుపునిచ్చారు. దివంగత కేరళ కాంగ్రెస్ నేత ఆర్యదాన్ ముహమ్మద్ స్మారకంగా ఏర్పాటు చేసిన పురస్కారాన్ని ఈ సందర్భంగా రేవంత్‌రెడ్డి అందుకున్నారు. కేరళ వెలుపలి రాష్ట్రానికి చెందిన నేతకు ఈ పురస్కారం దక్కడం ఇదే తొలిసారని కార్యక్రమ నిర్వాహకులు పేర్కొన్నారు.

# 92.87 లక్షల ఓటర్లకు.. పత్రాల పరీక్ష!

**నోటీసులు అందుకున్నవారు ఆధారాలు సమర్పించాలి**

**ఓటర్లకు ప్రధాన ఎన్నికల అధికారి సుదర్శన్‌రెడ్డి కీలక సూచన**

**వివరాల వ్యత్యాసాలు, పాత జాబితాతో అనుసంధానం కాకపోవడంపై నోటీసులు**

**నోటీసు వచ్చిందంటే ఓటు తొలగినట్లు కాదని స్పష్టత**


**అక్టోబర్ 7 వరకు దరఖాస్తులు, అభ్యంతరాలకు అవకాశం**

**నవంబర్ 9న తుది ఓటరు జాబితా**



తెలంగాణ బ్యూరో, సెప్టెంబర్ 25 (మన విశ్వం): రాష్ట్రంలో ఓటరు జాబితాల ప్రత్యేక సమగ్ర సవరణ ప్రక్రియ కీలక దశకు చేరుకుంది. వివిధ కారణాలతో నోటీసులు అందుకున్న ఓటర్లు వాటిలో పేర్కొన్న ఆధార పత్రాలను ఆలస్యం చేయకుండా సమర్పించాలని రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి సి.సుదర్శన్‌రెడ్డి సూచించారు. ప్రత్యేక సమగ్ర సవరణలో రాష్ట్రవ్యాప్తంగా 92.87 లక్షల మంది ఓటర్లకు సంబంధించిన నోటీసులు రూపొందించారు. వికారాబాద్ జిల్లా తాండూరు అసెంబ్లీ నియోజకవర్గంలో శుక్రవారం ప్రత్యేక సమగ్ర సవరణ ప్రక్రియను సుదర్శన్‌రెడ్డి క్షేత్రస్థాయిలో పరిశీలించారు. పోలింగ్ కేంద్ర స్థాయి అధికారులు నోటీసుల పంపిణీ, ఆధార పత్రాల సేకరణను ఎలా నిర్వహిస్తున్నారో సమీక్షించారు. ఓటర్లకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ప్రక్రియను సక్రమంగా నిర్వహించాలని అధికారులను ఆదేశించారు. ప్రత్యేక సమగ్ర సవరణ పరిశీలనలో 60.50 లక్షల మంది ఓటర్ల పేరు, వయసు తదితర వివరాల్లో వ్యత్యాసాలు గుర్తించగా, మరో 32.36 లక్షల మంది గత ప్రత్యేక సమగ్ర సవరణ జాబితాతో అనుసంధానం కాలేదని తాజా వివరాలు వెల్లడిస్తున్నాయి. ఈ రెండు విభాగాల్లో కలిపి సుమారు 92.87 లక్షల మందికి నోటీసుల ప్రక్రియ చేపట్టారు. అయితే నోటీసు వచ్చిందంటే ఓటు తొలగిపోయినట్లు కాదని గమనించాలి. సంబంధిత ఓటరు కోరిన ఆధార పత్రాలను సమర్పించి తన వివరాలను ధ్రువీకరించుకునే అవకాశం ఉంటుంది. అందువల్ల నోటీసులను నిర్లక్ష్యం చేయకుండా సకాలంలో స్పందించాలని ఎన్నికల అధికారులు సూచిస్తున్నారు. అర్హత ఉన్న ప్రతి పౌరుడు ఓటరుగా నమోదు చేసుకోవాలని ప్రధాన ఎన్నికల అధికారి కోరారు. కొత్తగా నమోదు కావాలనుకునేవారు అంతర్జాలం ద్వారా దరఖాస్తు చేసుకోవడంతో పాటు తమ ప్రాంతంలోని పోలింగ్ కేంద్ర స్థాయి అధికారుల సహాయంతోనూ నమోదు ప్రక్రియను పూర్తి చేసుకోవచ్చని తెలిపారు. సవరించిన కాలపట్టిక ప్రకారం దరఖాస్తులు, అభ్యంతరాలకు అక్టోబర్ 7 వరకు అవకాశం ఉండగా, వాటి పరిష్కారం, నోటీసులపై విచారణ నవంబర్ 5 వరకు కొనసాగనుంది. నవంబర్ 9న తుది ఓటరు జాబితా ప్రచురించనుండటంతో నోటీసులు అందుకున్న ఓటర్లు అవసరమైన ఆధార పత్రాలను సకాలంలో సమర్పించడం కీలకంగా మారింది.

# సీఈసీపై.. కాంగ్రెస్-బీజేపీ ఢీ!



**(మొదటిపేజీ తరువాయి)**

తప్పుకోవాలని కాంగ్రెస్ డిమాండ్ చేస్తుండగా.. ఎన్నికల జాబితాల ప్రత్యేక సమగ్ర సవరణ (ఎస్ఐఆర్) ప్రక్రియ చట్టబద్ధమేనని బీజేపీ కౌంటర్ ఇస్తోంది.

**14 అభ్యంతరాలతో దుమారం**

'ఇండియన్ ఎక్స్‌ప్రెస్' పరిశీలించిన అంతర్గత నోట్లు, లేఖల ప్రకారం.. సంధు, జోషి పది నెలల్లో కనీసం 14 సందర్భాల్లో అభ్యంతరాలను రికార్డు చేశారు. కొత్త ఓటర్ల నమోదు, ఫారం-6లో మార్పులు, ఓటర్ల పేర్ల చేర్పు-తొలగింపు, ఓటర్ల జాబితా డేటా నిర్వహణ వంటి అంశాలు వాటిలో ఉన్నాయి. కొన్ని చర్యలు తమకు తెలియకుండా జరిగాయని కూడా ఇద్దరు కమిషనర్లు పేర్కొన్నట్లు ఆ కథనం వెల్లడించింది.

**సీఈసీ తప్పుకోవాలి: కాంగ్రెస్**

ఈ పరిణామాలతో సీఈసీపై కాంగ్రెస్ దాడి తీవ్రం చేసింది. జ్ఞానేశ్‌కుమార్ రాజీనామా చేయాలని లోక్‌సభ ప్రతిపక్ష నేత రాహుల్‌గాంధీ డిమాండ్ చేశారు. ఎన్నికల ప్రక్రియపై తాము లేవనెత్తుతున్న ప్రశ్నలకు సమాధానం చెప్పాలని కోరారు. సీఈసీకి వ్యతిరేకంగా కాంగ్రెస్ దేశవ్యాప్తంగా ఆందోళన కార్యక్రమాలకు దిగింది. అయితే ఇవి కాంగ్రెస్ చేస్తున్న రాజకీయ ఆరోపణలు, డిమాండ్లే తప్ప సీఈసీపై అక్రమాలు నిర్ధారణ అయినట్లు కాదు.

**'ప్రక్రియ చట్టబద్ధమే': బీజేపీ**

కాంగ్రెస్ ఆరోపణలను బీజేపీ తిప్పికొట్టింది. ఎస్ఐఆర్‌కు చట్టపరమైన ఆధారం ఉందని బీజేపీ అధికార ప్రతినిధి సుధాంశు త్రివేది పేర్కొన్నారు. ఎన్నికల సంఘంలోని నిర్ణయ ప్రక్రియను తప్పుగా చిత్రీకరిస్తున్నారని ఆరోపిస్తూ.. ఎన్నికల్లో ఎదురైన పరాజయాలకు ఈసీని బాధ్యులను చేయడం సరికాదని కాంగ్రెస్‌పై విమర్శలు చేశారు.

**'తుది నిర్ణయాలు ఏకగ్రీవమే': ఈసీ**

ఎన్నికల సంఘం మాత్రం భిన్నాభిప్రాయాలు నిర్ణయ ప్రక్రియలో భాగమేనని తెలిపింది. 'ఇండియన్ ఎక్స్‌ప్రెస్' వెల్లడించిన 14 నోట్ల ఉనికి, తేదీలు లేదా వాటిలోని అంశాలను ఈసీ ఖండించలేదు. అయితే వాటిని సూచనలుగా పేర్కొంటూ, గత ఏడాదిలో తీసుకున్న తుది నిర్ణయాలన్నీ ఏకగ్రీవంగానే జరిగాయని స్పష్టం చేసింది.

**ఎన్డీఏ మిత్రులూ.. 'స్పష్టత ఇవ్వాలి'**

ఈ వివాదంపై ఎన్డీఏ మిత్రపక్షాలకు చెందిన చిరాగ్ పాస్వాన్, ఉపేంద్ర కుష్వాహా, టీడీపీ ఎంపీ లావు శ్రీకృష్ణదేవరాయలు కూడా స్పందించారు. ఎన్నికల ప్రక్రియపై ప్రజల్లో తలెత్తిన సందేహాలను ఈసీ నివృత్తి చేయాలని, పారదర్శకత ఉండాలని అభిప్రాయపడ్డారు. అయితే కాంగ్రెస్ చేస్తున్న సీఈసీ రాజీనామా డిమాండ్‌కు వారు మద్దతు ప్రకటించలేదు. ఒకవైపు సీఈసీ రాజీనామా కోరుతున్న కాంగ్రెస్.. మరోవైపు ఎస్ఐఆర్‌ను సమర్థిస్తున్న బీజేపీ.. మధ్యలో ఇద్దరు కమిషనర్ల 14 అభ్యంతరాలపై చర్చ. దీంతో ఆ అభ్యంతరాలను తుది నిర్ణయాల్లో ఎలా పరిష్కరించారన్న అంశమే ఇప్పుడు రాజకీయ వివాదానికి కేంద్రంగా మారింది.

# గురుకుల పాఠశాలలో కలెక్టర్ ఆకస్మిక తనిఖీ

**- పదో తరగతి విద్యార్థులు ప్రణాళికతో చదవాలి**

**- పరిసరాల పరిశుభ్రతకు ప్రాధాన్యమివ్వండి..నిర్మల్ జిల్లా కలెక్టర్ భవేష్ మిశ్రా**

**ముధోల్ (సోన్),సెప్టెంబర్ 25 (మన విశ్వం):** విద్యార్థులు తమ విద్యాసంవత్సరం ఆరంభం నుంచే లక్ష్యాన్ని నిర్దేశించుకుని, రాబోయే బోర్డు పరీక్షల్లో ఉత్తమ ప్రతిభ కనబరిచేలా ప్రణాళికాబద్ధంగా చదవాలని నిర్మల్ జిల్లా కలెక్టర్ భవేష్ మిశ్రా పిలుపునిచ్చారు.సోన్ మండలం లెఫ్ట్ పోచంపాడ్ గ్రామంలోని ప్రభుత్వ బాలికల సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాలను శుక్రవారం ఆయన ఆకస్మికంగా సందర్శించి, క్షేత్రస్థాయిలో అందుతున్న విద్యా వసతులను తనిఖీ చేశారు.

**బోధనా తీరుపై ఆరా**

ఈ పర్యటనలో భాగంగా కలెక్టర్ నేరుగా తరగతి గదుల్లోకి వెళ్లి విద్యార్థినులతో ముఖాముఖి మాట్లాడారు. ఉపాధ్యాయుల బోధనా పద్ధతులు, సిలబస్ పూర్తి అవుతున్న తీరును అడిగి తెలుసుకున్నారు. ముఖ్యంగా పదో తరగతి బోర్డు పరీక్షలు రాయబోతున్న



విద్యార్థినులకు ప్రత్యేక తరగతులు నిర్వహించాలని, వెనుకబడిన విద్యార్థులపై ప్రత్యేక శ్రద్ధ పెట్టాలని ఉపాధ్యాయులను ఆదేశించారు.చదువుతో పాటు విద్యార్థుల్లో సృజనాత్మకతను పెంచేలా వినూత్న పద్ధతుల్లో బోధన సాగించాలని స్పష్టం చేశారు.

**వసతుల పరిశీలన**

మెనూ అమలుపై ఆదేశాలుపాఠశాల ఆవరణ, వంటగది, డైనింగ్ హాల్‌ను పరిశీలించిన కలెక్టర్, విద్యార్థినులకు నిబంధనల ప్రకారం నాణ్యమైన పోషకాహారాన్ని అందించాలని సూచించారు. ప్రభుత్వం నిర్దేశించిన మెనూను పక్కాగా అమలు చేయాలన్నారు. పాఠశాల పరిసరాలు ఎల్లప్పుడూ పరిశుభ్రంగా ఉండేలా చూడాలని, తాగునీరు, మరుగుదొడ్ల నిర్వహణలో ఎలాంటి నిర్లక్ష్యం వహించవద్దని అధికారులను హెచ్చరించారు. విద్యార్థి నులకు కల్పించే వసతుల విషయంలో రాజీ పడే ప్రసక్తే లేదని, ఏవైనా సమస్యలు ఉంటే వెంటనే తన దృష్టికి తీసుకురావాలని పాఠశాల ప్రిన్సిపాల్ యం.సరస్వతి కి కలెక్టర్ సూచించారు. కలెక్టర్ వెంట స్థానిక రెవెన్యూ అధికారులు, విద్యాశాఖ అధికారి భోజన్న మరియు పాఠశాల సిబ్బంది పాల్గొన్నారు.

# విఘ్నేశ్వరుని నిమజ్జన ప్రారంభ పూజలో ఎమ్మెల్సీ దండే విఠల్



**కొమరం బీం, సెప్టెంబర్ 25(మన విశ్వం):** కాగజ్‌నగర్ పట్టణంలో హిందూ ఉత్సవ సమితి ఆధ్వర్యంలో విఘ్నేశ్వరుని నిమజ్జన ప్రారంభ పూజా కార్యక్రమం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా ఎమ్మెల్సీ దండే విఠల్ ముఖ్య అతిథిగా హాజరై వినాయకుడికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. నిమజ్జన కార్యక్రమం ఎలాంటి ఆటంకాలు లేకుండా ప్రశాంతంగా సాగాలని ఆకాంక్షించారు.కార్యక్రమంలో సిర్పూర్ ఎమ్మెల్యే డాక్టర్ పాల్వాయి హరీష్ బాబు, కాగజ్‌నగర్ సబ్ కలెక్టర్ హర్ష్ చౌదరి, మున్సిపల్ కౌన్సిలర్లు, స్థానిక ప్రజాప్రతినిధులు, అధికారులు, హిందూ ఉత్సవ సమితి సభ్యులు, భక్తులు పాల్గొన్నారు. నిమజ్జనానికి అవసరమైన ఏర్పాట్లను నిర్వాహకులు చేపట్టారు.

# గత పాలకుల నిర్లక్ష్యమే రెండు మండలాల ప్రజలకు శాపం

**- బెజ్జూర్--పెంచికల్‌పేట్ రహదారి దుస్థితిపై మైనార్టీ జిల్లా అధ్యక్షుడు అర్షద్ హుస్సేన్ ఆగ్రహం**

**- విద్యార్థులు రోడ్డెక్కే దుస్థితి రావడం బాధాకరం**

**- రహదారి నిర్మాణానికి ఎమ్మెల్యే హరీష్ బాబు చొరవ చూపాలని డిమాండ్**

**కొమురం భీం/బెజ్జూర్, సెప్టెంబర్ 25(మన విశ్వం):** గత పాలకుల అలసత్వం, నిర్లక్ష్యం కారణంగానే బెజ్జూర్, పెంచికల్‌పేట్ మండలాల ప్రజలకు రహదారి సమస్య శాపంగా మారిందని కాంగ్రెస్ పార్టీ మైనార్టీ జిల్లా అధ్యక్షుడు అర్షద్ హుస్సేన్ మండిపడ్డారు. శుక్రవారం బెజ్జూర్ మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు.లోడ్‌పల్లి నుంచి పెంచికల్‌పేట్ వైపు వెళ్లే ప్రధాన రహదారి గుంతలమయంగా మారి అధ్వాన స్థితికి చేరిందని, దీంతో నిత్యం రాకపోకలు సాగించే ప్రయాణికులు తీవ్ర అవస్థలు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. సరైన రవాణా సౌకర్యం లేక పాఠశాలలు, కళాశాలలకు వెళ్లే విద్యార్థులు నిత్యం నరకయాతన అనుభవిస్తున్నారని. సమస్యను పరిష్కరించాలని చివరకు విద్యార్థులే రోడ్డెక్కి ఆందోళన చేయాల్సిన దుస్థితి రావడం అత్యంత బాధాకరమన్నారు.మాజీ ఎమ్మెల్యే కోనేరు కోనప్ప సుదీర్ఘకాలం పాటు నియోజకవర్గ ప్రజాప్రతినిధిగా పనిచేసినప్ప



టికీ, ఈ రహదారి సమస్యకు శాశ్వత పరిష్కారం చూపడంలో పూర్తిగా విఫలమయ్యారని ఆయన విమర్శించారు. ఇప్పటికైనా స్థానిక సిర్పూర్ ఎమ్మెల్యే డాక్టర్ పాల్వాయి హరీష్ బాబు స్పందించి, బెజ్జూర్--పెంచికల్‌పేట్ రహదారి నిర్మాణానికి ప్రత్యేక చొరవ చూపి నిధులు మంజూరు చేయించాలని డిమాండ్ చేశారు. ప్రజలు, విద్యార్థుల ఇబ్బందులను దృష్టిలో ఉంచుకుని తక్షణమే పనులు ప్రారంభించేలా చర్యలు తీసుకోవాలని కోరారు.


# మానసిక ఆరోగ్యంపై విద్యార్థులకు అవగాహన




**నర్సంపేట, సెప్టెంబర్ 25(మన విశ్వం):** విద్యార్థుల్లో మానసిక ఆరోగ్యంపై అవగాహన కల్పించేందుకు నర్సంపేట ప్రభుత్వ మైనారిటీ పాఠశాలలో మానసిక ఆరోగ్య అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ సైకాలజిస్ట్స్ అసోసియేషన్ మెడికల్ ఆఫీసర్ డాక్టర్ శ్రీలత విద్యార్థులతో మాట్లాడారు.ఈ సందర్భంగా మానసిక ఆరోగ్యం, ఒత్తిడి నియంత్రణ, భావోద్వేగ సమతుల్యత వంటి అంశాలపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. పరీక్షల సమయంలో ఎదురయ్యే ఒత్తిడి, ఆందోళన, తోటి విద్యార్థుల ప్రభావం వంటి సమస్యలను అధిగమించేందుకు అనుసరించాల్సిన మార్గాలను వివరించారు.విద్యార్థులు ఆత్మవిశ్వాసంతో ముందుకు సాగాలని, తమ సమస్యలను మనసులో దాచుకోకుండా అవసరమైన సమయంలో తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు లేదా నిపుణుల సహాయం తీసుకోవాలని డాక్టర్ శ్రీలత సూచించారు. కార్యక్రమంలో విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొన్నారు.

# కాంగ్రెస్‌లో చేరాలని ఒత్తిడి.. కౌన్సిలర్ కృష్ణవేణి ఆరోపణ

**బెల్లంపల్లి సెప్టెంబర్ 25 (మన విశ్వం):** తాను బీఆర్ఎస్ పార్టీ తరఫున ఆరో వార్డు కౌన్సిలర్‌గా గెలుపొందినప్పటికీ, కాంగ్రెస్ పార్టీలో చేరాలని గత ఆరు నెలలుగా మున్సిపల్ చైర్‌పర్సన్ భర్త దావ రమేష్ తనపై ఒత్తిడి తెస్తున్నారని ఆరో వార్డు కౌన్సిలర్ కృష్ణవేణి ఆరోపించారు.కాంగ్రెస్ పార్టీలో చేరే ఆసక్తి లేదని పలుమార్లు స్పష్టం చేసినప్పటికీ, కౌన్సిల్ సమావేశాల నేపథ్యంలో అధికారులు, ఇతర వ్యక్తుల ద్వారా తనపై ఒత్తిడి తీసుకొస్తున్నారని ఆమె పేర్కొన్నారు. బీఆర్ఎస్ కౌన్సిలర్లతో కలిసి నిరసన కార్యక్రమాల్లో పాల్గొంటే వార్డులో అభివృద్ధి పనులు చేపట్టబోమని బెదిరింపులు వచ్చినట్లు ఆరోపించారు.గత ఆరు నెలలుగా ఆరో వార్డులో అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టడం లేదని, మున్సిపల్ కమిషనర్, అధికారులను సంప్రదించినప్పటికీ స్పందన లేదని కృష్ణవేణి తెలిపారు.అదేవిధంగా, తమ వార్డులో ఆర్పీగా ఎన్నికైన బొడ్డు లలితను కూడా రాజకీయ కారణాలతో ఇబ్బందులకు గురిచేస్తున్నారని ఆమె ఆరోపించారు. తనకు మద్దతుగా ఉంటే ఆర్పీ పదవి నుంచి తొలగిస్తామని బెదిరింపులు వచ్చినట్లు తెలిపారు. ఆర్పీకి జారీ చేసిన నోటీసుల్లోని ఆరోపణలు అవాస్తవమని, తమ వద్ద అందుకు సంబంధించిన ఆధారాలు ఉన్నాయని కృష్ణవేణి పేర్కొన్నారు.తమ కదలికలను గమనిస్తూ ఫొటోలు, వీడియోలు తీసేందుకు కొందరిని పంపిస్తున్నారని




కూడా ఆమె ఆరోపించారు. తనపై, ఆర్పీపై జరుగుతున్న వేధింపులపై అధికారులు స్పందించి న్యాయం చేయాలని, తమకు రక్షణ కల్పించాలని కౌన్సిలర్ కృష్ణవేణి కోరారు.

ఈ కార్యక్రమంలో టౌన్ అధ్యక్షుడు నోటేటి సత్యనారాయణ, మున్సిపల్ వైస్ చైర్మన్ భక్తుల సుదర్శన్, కౌన్సిలర్లు తాండ్ర స్రవంతి, సిమ్రాన్, తిరుమల వాసు, రాజ్ కుమార్, కంపెల్లి రాజం, ఈట కమల ప్రసన్న, బిడ్డల సౌజన్యతో పాటు నాయకులు, ఎస్ఎల్ఎఫ్ సభ్యులు పాల్గొన్నారు.

# మన్ కీ బాత్ నల్లబెల్లి మండల కన్వీనర్‌గా ధర్మారం క్రాంతికుమార్

**నల్లబెల్లి, సెప్టెంబర్ 25(మన విశ్వం):** ప్రధానమంత్రి నరేంద్ర మోదీ నిర్వహించే 'మన్ కీ బాత్' కార్యక్రమాన్ని నల్లబెల్లి మండలంలో ప్రజల్లోకి మరింత విస్తృతంగా తీసుకెళ్లేందుకు ధర్మారం క్రాంతికుమార్‌ను మండల కన్వీనర్‌గా నియమించినట్లు బీజేపీ నల్లబెల్లి మండల పార్టీ అధ్యక్షుడు తడుక వినయ్ గౌడ్ తెలిపారు.ప్రతి నెల ప్రధానమంత్రి దేశ ప్రజలను ఉద్దేశించి నిర్వహించే 'మన్ కీ బాత్' కార్యక్రమాన్ని మండలంలోని ప్రతి బూత్‌లో పార్టీ నాయకులు, కార్యకర్తలు, ప్రజల భాగస్వామ్యంతో విజయవంతంగా నిర్వహించేలా క్రాంతికుమార్ సమన్వయం చేయాలని ఆయన సూచించారు.ప్రధాని మోదీ ఆలోచనలు, కేంద్ర ప్రభుత్వ సంక్షేమ పథకాలు, దేశ అభివృద్ధికి సంబంధించిన అంశాలను ప్రజల్లోకి తీసుకెళ్లడంలో 'మన్ కీ బాత్' కార్యక్రమం కీలకంగా నిలుస్తుందని తడుక వినయ్ గౌడ్ పేర్కొన్నారు.




# విఠలేశ్వర ఆలయంలో గణపయ్యను దర్శించుకున్న ముధోల్ ఎమ్మెల్యే

**- రూ.55 వేలు పలికిన లడ్డూ ప్రసాదం**

**ముధోల్ (కుబీర్),సెప్టెంబర్ 25(మన విశ్వం):** నిర్మల్ జిల్లా కుబీర్ మండల కేంద్రంలోని విఠలేశ్వర ఆలయంలో కొలువుదీరిన కర్ర గణపయ్యను శుక్రవారం ముధోల్ ఎమ్మెల్యే రామారావు పటేల్ దర్శించుకున్నారు.ఈ సందర్భంగా ఆలయానికి విచ్చేసిన ఎమ్మెల్యేకు ఆలయ కమిటీ సభ్యులు ఘన స్వాగతం పలికారు. అనంతరం ఎమ్మెల్యే గణపయ్యకు ప్రత్యేక పూజలు నిర్వహించి, స్వామివారి ఆశీస్సులు అందుకున్నారు.ఈ సందర్భంగా ఆలయ కమిటీ సభ్యులు ఎమ్మెల్యేను శాలువాతో ఘనంగా సత్కరించారు.ఘనంగా లడ్డూ వేలం పాటఆలయంలో కొలువుదీరిన కర్ర గణపయ్య లడ్డూ ప్రసాదం వేలం పాటను శుక్రవారం భక్తుల సమక్షంలో ఉత్సాహంగా నిర్వహించారు. ఈ వేలం పాటలో సూది రాజన్న అనే భక్తుడు రూ.55 వేలకు లడ్డూను దక్కించుకున్నారు. అలాగే స్వామివారి పలక, బలపంను బోయిడి విఠల్ రూ.11 వేలకు,నోట్‌బుక్ మరియు పెన్నును కందూరు కనకయ్య రూ.11,500లకు సొంతం చేసుకున్నారు. భక్తులు ఎంతో ఆసక్తిగా పాల్గొనడంతో వేలం పాట కార్యక్రమం



ఎంతో కోలాహలంగా సాగింది.ఈ పూజా మరియు వేలం కార్యక్రమాల్లో ఆలయ కమిటీ సభ్యులతో పాటు పెద్ద సంఖ్యలో భక్తులు, గ్రామస్థులు తదితరులు పాల్గొన్నారు.

# రాష్ట్రస్థాయి ఫుట్‌బాల్ పోటీలకు కాసిపేట గురుకుల విద్యార్థులు

**బెల్లంపల్లి,సెప్టెంబర్ 25(మన విశ్వం):** మందమర్రి సెవెన్ ఆఫ్ హోప్ హైస్కూల్‌లో నిర్వహించిన ఎస్జిఎఫ్ అండర్--19 ఫుట్‌బాల్ పోటీల్లో తెలంగాణ సాంఘిక సంక్షేమ గురుకుల కాసిపేట విద్యార్థులు ఎం. విగ్నేశ్వర్, జి. కార్తీక్ అత్యుత్తమ ప్రతిభ కనబరిచి రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికయ్యారు.ఈ సందర్భంగా ప్రిన్సిపల్ పూటూరి సంతోష్ కుమార్ హర్షం వ్యక్తం చేస్తూ, రాష్ట్రస్థాయిలోనూ ఇదే క్రీడాస్ఫూర్తితో ప్రతిభ కనబరచాలని ఆకాంక్షించారు. ఎంపికైన విద్యార్థులను ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో పీడీ కె. హరిష్, పీఈటీ ఎ. రాజేందర్, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొని క్రీడాకారులను అభినందించారు.



# మృతుల కుటుంబాలకు పరామర్శ

**జిల్లా కాంగ్రెస్ ఎగ్జిక్యూటివ్ మెంబర్, మాతృశ్రీ ఫౌండేషన్ చైర్మన్ దొంతుల శ్రీనివాస్**



**టేకుమట్ల.సెప్టెంబర్ 25 (మన విశ్వం)** టేకుమట్ల మండలంలోని రామకృష్ణపూర్ (వి) గ్రామానికి చెందిన లద్దునూరి సమ్మక్క,ఎంపేడు గ్రామానికి చెందిన బొల్లి రాజయ్య ఇటీవలే అనారోగ్యంతో మృతి చెందడంతో వారి కుటుంబ సభ్యులను జిల్లా కాంగ్రెస్ ఎగ్జిక్యూటివ్ మెంబర్,మాతృశ్రీ ఫౌండేషన్ చైర్మన్ దొంతుల శ్రీనివాస్ మృతుల కుటుంబ సభ్యులను పరామర్శించి ప్రగాఢ సానుభూతి తెలిపి మనో ధైర్యాన్ని అందించి ప్రగాఢ సానుభూతి తెలిపారు.అనంతరం మాతృశ్రీ ఫౌండేషన్ తరపున ఒక్కొక్క కుటుంబానికి 25 కిలోల బియ్యం బస్తాను అందజేశారు.కష్టకాలంలో బాధిత కుటుంబాలకు అండగా నిలవడం ప్రతి ఒక్కరి సామాజిక బాధ్యత అని దొంతుల శ్రీనివాస్ అన్నారు.ఈ కార్యక్రమంలో రాఘవాపూర్ సర్పంచ్ అంబాల కిరణ్,మండల కాంగ్రెస్ ఎస్సీ సెల్ అధ్యక్షులు లద్దునూరి ఐలయ్య,జిల్లా ఎస్సీ సెల్ నాయకులు ఆరకొండ రాజయ్య,మండల ఎస్సీ సెల్ నాయకులు పారణంది రాములు తదితరులు ఉన్నారు.

# గ్రామస్తుల కోలాహలం మధ్య ముగిసిన గణనాథుల నిమజ్జనం



**ముధోల్ (తానూర్), సెప్టెంబర్ 25,(మన విశ్వం):** మండల పరిధిలోని బెల్తరోడ గ్రామంలో వినాయక చవితి నవరాత్రి ఉత్సవాలు ముగింపు సందర్భంగా వినాయక నిమజ్జన కార్యక్రమం అత్యంత అంగరంగ వైభవంగా నిర్వహించారు.గ్రామంలో ప్రతిష్టించిన మహాత్మ యూత్ మరియు వాయుసేన యూత్ గణేష్ విగ్రహాలను శోభాయాత్రతో ఊరేగించి, వైభవంగా నిమజ్జనం చేశారు.ఈ నిమజ్జన శోభాయాత్రను విజయవంతం చేయడంలో యూత్ సభ్యులు కీలక పాత్ర పోషించారు. కార్యక్రమంలో యూత్ సభ్యులైన రాజు, ఉమేష్, శంకర్, మహేష్, యోగేష్, సురేష్, డి.రవి, లక్ష్మణ్, మల్లేష్, కే.రవి, కృష్ణ, గంగాధర్ తదితరులు పాల్గొని నిమజ్జన మహోత్సవాన్ని దిగ్విజయం చేశారు. భక్తుల కోలాహలం, జై బోలో గణేష్ మహారాజ్ కీ జై అనే నినాదాల మధ్య నిమజ్జన వేడుకలు ఘనంగా ముగిశాయి.

# రూ.3.11 లక్షలకు వినాయక లడ్డూ



**కుత్బుల్లాపూర్, సెప్టెంబర్ 25 (మన విశ్వం):** కుత్బుల్లాపూర్ నియోజకవర్గం గాజులరామారం మహాదేవపురం డివిజన్ పరిధిలోని మోక్షిత్ హిల్ వ్యూ కాలనీలో వినాయక నవరాత్రి ఉత్సవాలు భక్తిశ్రద్ధలతో సాగాయి. ఉత్సవాల్లో భాగంగా నిర్వహించిన లడ్డూ వేలం పాట ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. కాలనీ అధ్యక్షుడు పల్లి నరేష్ కుమార్ రెడ్డి రూ.3.11 లక్షలకు లడ్డూను దక్కించుకున్నారు.కార్యక్రమంలో మహాదేవపురం 277 డివిజన్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు సిద్ధనోళ్ల సంజీవ రెడ్డి, సోమిరెడ్డి, రామనాయుడు, చంద్రశేఖర్, శ్రీధర్ గౌడ్, నర్సిరెడ్డి, కమలాకర్ రెడ్డి, గణేష్‌తో పాటు ఉత్సవ కమిటీ సభ్యులు, కాలనీ వాసులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# పోషకాహారంతోనే పిల్లల సంపూర్ణ ఎదుగుదల



**టేకుమట్ల.సెప్టెంబర్ 25 (మన విశ్వం):** టేకుమట్ల మండలంలోని వెలిశాల సెక్టార్ పరిధిలోని వెంకట్రావుపల్లి (బి) అంగన్వాడి కేంద్రంలో సూపర్వైజర్ మాధవి ఆధ్వర్యంలో 9వ పోషణ మాస కార్యక్రమాన్ని ఈ ఏడాది పోషణ మాసం థీమ్ మన అంగన్వాడి--మన బాధ్యతగా నిర్వహిస్తున్నామన్నారు.ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా గ్రామ సర్పంచ్ పెరుమాండ్ల చంద్రకళ హాజరై మాట్లాడుతూ తల్లులకు,పిల్లలకు పోషణ చాలా అవసరం అని పిల్లలు వయసుకు తగ్గ బరువు,ఎత్తుకు తగిన బరువు కలిగి ఉన్నప్పుడే శారీరకంగా,మానసికంగా ఆరోగ్యంగా ఎదుగుతారని తెలిపారు.పిల్లలు ఆరోగ్యంగా ఉండేందుకు గుడ్లు,ఆకుకూరలు,పండ్లు, చిరుధాన్యాలు,పప్పు దినుసులు ఎక్కువగా అందించాలని తల్లులకు, గర్భిణీలకు,బాలింతలకు సూచించారు.గర్భిణీలు గర్భధారణ సమయంలో సీజన్‌లో లభించే ఆకుకూరలు, కూరగాయలు,పండ్లు తీసుకోవాలని సూచించారు. పోషకాహారంపై ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని అన్నారు.ఈ కార్యక్రమంలో గర్భిణీలు, బాలింతలు,పిల్లలు, అంగన్వాడీ టీచర్ భాగ్యలక్ష్మి,ఆశా వర్కర్ శారద,ఆయా కొమురమ్మ తదితరులు పాల్గొన్నారు.

# కాకతీయ కళావైభవం.. ప్రకృతి సోయగాల నిలయం ములుగు

- **విశ్వవేదికపై విరాజిల్లుతున్న ప్రపంచ వారసత్వ రామప్ప**
- **చారిత్రక, ప్రకృతి సంపదను భావితరాలకు అందించాలి**
- **పర్యాటక ప్రాంతాల పరిరక్షణ అందరి బాధ్యత**
- **మంత్రి దనసరి అనసూయ సీతక్క**



**ములుగు, సెప్టెంబర్ 25 (మన విశ్వం):** కాకతీయుల అద్భుత శిల్పకళా వైభవం, పచ్చని అడవులు, గుట్టలు, సెలయేళ్లు, జలపాతాలు, వాగులతో ములుగు జిల్లా ప్రకృతి వర్ణశోభకు నిలయంగా ఉందని రాష్ట్ర మంత్రి దనసరి అనసూయ సీతక్క అన్నారు. చారిత్రక కట్టడాలు, ప్రకృతి సం పదను పరిరక్షించి భావితరాలకు అందించడం ప్రతి ఒక్కరి బాధ్యతని పేర్కొన్నారు.వెంకటాపూర్ మండలం పాలంపేటలోని ప్రపంచ వారసత్వ రామప్ప దేవాలయం ఆవరణలో వరల్డ్ టూరిజం డే--2026 సందర్భంగా పర్యాటక శాఖ ఆధ్వర్యంలో జిల్లా కలెక్టర్ బోర్ఖడే హేమంత్ సహదేవరావు అధ్యక్షతన హెరిటేజ్ వాక్, తెలంగాణ దర్శిని, పోటీలు, సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన మంత్రి సీతక్క, కలెక్టర్‌తో కలిసి గొల్లల గుడి నుంచి రామప్ప దేవాలయం వరకు హెరిటేజ్ వాక్‌ను ప్రారంభించారు.

ఈ సందర్భంగా సీతక్క మాట్లాడుతూ 13వ శతాబ్దపు రామప్ప దేవాలయం కాకతీయుల కళా సంపదకు నిలువెత్తు నిదర్శనమన్నారు. ప్రపంచ వారసత్వ కట్టడంగా గుర్తింపు పొందిన రామప్ప గొప్పతనాన్ని మరింత విశ్వవ్యాప్తం చేయాల్సిన అవసరం ఉందన్నారు. శతాబ్దాలుగా తరతరాలకు అందుతున్న ఈ అపురూప వారసత్వాన్ని కాపాడుకోవాలని పిలుపునిచ్చారు.

ములుగు జిల్లాలోని పచ్చని అడవులు, గుట్టలు, సెలయేళ్లు, వాగులు, వన్యప్రాణులు జిల్లాకు ప్రత్యేక ప్రకృతి సౌందర్యాన్ని అందిస్తున్నాయని తెలిపారు. మేడారం సమ్మక్క--సారలమ్మ జాతర, లక్నవరం సరస్సు, బొగత జలపాతం, మల్లూరు లక్ష్మీనరసింహస్వామి ఆలయం వంటి ప్రాంతాలు పర్యాటకంగా జిల్లాకు ప్రత్యేక గుర్తింపు తీసుకొచ్చాయని చెప్పారు. పర్యావరణం, చారిత్రక సంపద పరిరక్షణను ప్రతి ఒక్కరూ సామాజిక బాధ్యతగా స్వీకరించాలని సూచించారు. పర్యాటక రంగంలో ములుగు జిల్లాకు పురస్కారం రావడం గర్వకారణమన్నారు.అనంతరం వివిధ పోటీలు, సాంస్కృతిక కార్యక్రమాల్లో ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో జిల్లా ఎస్పీ సుధీర్ రామ్నాథ్ కేకన్, అదనపు కలెక్టర్లు సీహెచ్ మహేందర్ జి, సంపత్‌రావు, పంచాయతీరాజ్ శాఖ డైరెక్టర్ భగవాన్ రెడ్డి, టూరిజం నోడల్ అధికారి ధర్మ నాయక్, స్థానిక సర్పంచ్ రాజు, , విద్యార్థులు పాల్గొన్నారు.

# భోసి గణనాథుడి సన్నిధిలో భక్తి, దేశభక్తిల త్రివేణీ సంగమం!



**ముధోల్(తానూర్), సెప్టెంబరు25(మన విశ్వం):** నిర్మల్ జిల్లా తానూర్ మండలం భోసి గ్రామంలో గణనాథుడి నవరాత్రి ఉత్సవాలు అత్యంత వైభవంగా సాగుతున్నాయి. గ్రామంలో ప్రతిష్టించిన కర్ర వరసిద్ధి వినాయకుడి ఆలయంలో శుక్రవారం రెండు ప్రత్యేక కార్యక్రమాలను ఘనంగా నిర్వహించారు.పోటా పోటీగా లడ్డూ వేలం పాటఆలయ కమిటీ ఆధ్వర్యంలో నిర్వహించిన గణనాథుడి లడ్డూ ప్రసాదం వేలం పాట పోటాపోటీగా సాగింది. భక్తులు ఎంతో భక్తిశ్రద్ధలతో ఈ వేలంలో పాల్గొనగా, గ్రామానికి చెందిన పసుల భోజన్న లడ్డూను అత్యధికంగా రూ. 71 వేల భారీ ధరకు పాడుకుని దక్కించుకున్నారు. ఈ సందర్భంగా ఆలయ కమిటీ సభ్యులు, గ్రామస్తులు భోజన్నను ప్రత్యేకంగా అభినందించి, శాలువాతో ఘనంగా సన్మానించారు.మిన్నంటిన దేశభక్తి.. సామూహిక వందేమాతరంవినాయక నవరాత్రి ఉత్సవాల సందర్భాన్ని పురస్కరించుకుని, మహానాయకుడు బంకిం చంద్ర చటర్జీ జన్మదినాన్ని పురస్కరించుకుని ఆలయ కమిటీ ఆధ్వర్యంలో సామూహిక వందేమాతరం గీతాలాపన కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు.ఈ కార్యక్రమంలో భక్తులు, గ్రామస్తులు,విద్యార్థులు పెద్ద సంఖ్యలో పాల్గొని దేశభక్తి గీతాలను ఆలపించారు.ఈ కార్యక్రమాలతో భోసి గ్రామంలో అటు ఆధ్యాత్మిక, ఇటు దేశభక్తి వాతావరణం మిన్నంటింది.

# 'చలో యాదగిరిగుట్ట'ను జయప్రదం చేయాలి

- **ఉద్యమకారులు అధిక సంఖ్యలో తరలిరావాలి**
- **టఫ్ జిల్లా అధ్యక్షుడు పోరిక గోవింద్ నాయక్**
- **చలో యాదగిరిగుట్ట పోస్టర్ ఆవిష్కరణ**



**ములుగు, సెప్టెంబర్ 25(మన విశ్వం):** తెలంగాణ ఉద్యమకారుల సమస్యల పరిష్కారం కోసం ఈ నెల 27న యాదగిరిగుట్టలో నిర్వహించనున్న సదస్సును జయప్రదం చేయాలని తెలంగాణ ఉద్యమకారుల ఫోరం (టఫ్) జిల్లా అధ్యక్షుడు పోరిక గోవింద్ నాయక్ పిలుపునిచ్చారు.శుక్రవారం వెంకటాపూర్ మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన సమావేశంలో 'చలో యాదగిరిగుట్ట' పోస్టర్‌ను నాయకులు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా గోవింద్ నాయక్ మాట్లాడుతూ తెలంగాణ ఉద్యమకారుల సమస్యలను ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని డిమాండ్ చేశారు. ఉద్యమకారుల హక్కులు, సమస్యలపై నిర్వహించే సదస్సుకు ములుగు జిల్లా నుంచి ఉద్యమకారులు అధిక సంఖ్యలో తరలిరావాలని కోరారు.కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి చంటి భద్రయ్య, సీనియర్ నాయకులు పల్నాటి రమేష్, మాజీ ఎంపీటీసీ గాజుల శ్రీనివాస్, జహీర్ పాషా, బోయిని సదయ్య, జంగిలి మహేందర్, జరుపుల రమేష్, అల్లేపు రవి తదితరులు పాల్గొన్నారు.

# బంగారు, వెండి పతకాలు సాధించిన వేణు ఉషూ కుంగ్ ఫూ విద్యార్థులు.

**బెల్లంపల్లి,సెప్టెంబర్ 25(మన విశ్వం):** బెల్లంపల్లి పట్టణ వేణు ఉషు కుంగ్ ఫూ కరాటే విద్యార్థిని, విద్యార్థులు, రాష్ట్రస్థాయి పోటీలలో పాల్గొని, బంగారు, వెండి పథకాలు సాధించారని, మాస్టర్ టి, ప్రసాద్ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ఈనెల 20న మంచిర్యాల జిల్లా సోమ గూడెం లో జరిగిన రాష్ట్రస్థాయి కరాటే పోటీలలో వేణు ఉషూ కుంగ్ ఫూ విద్యార్థిని విద్యార్థులు , బాలికల కటాస్ విభాగంలో పాల్గొన్న ఏ, హరిల్ బంగారు పథకం, కే ప్రియదర్శిని, దాముక అవంతిక,లు వెండి పతకం సాధించారని, స్పారింగ్ విభాగంలో డి, మనీష్ బంగారు పతకం, ఏ హర్షిత్ రాణి, దాముఖ అవంతిక, డి, బిందులు వెండి పతకాలు సాధించారని తెలిపారు. ఈ సందర్భంగా సంస్థ అధ్యక్షులు గెల్లి రాజలింగు, ప్రధాన కార్యదర్శి బోగే కరుణాకర్లు పథకాలు సాధించిన విద్యార్థిని, విద్యార్థులను అభినందించారు.



# వందేమాతరం పాడని వారు దేశద్రోహులే: ఎమ్మెల్యే పవార్ రామారావు పటేల్





**ముధోల్ (భైంసా), సెప్టెంబర్ 25(మన విశ్వం):** దేశంలో నివసిస్తున్న ప్రతి ఒక్కరూ వందేమాతరం పాడాల్సిందేనని, అలా పాడని వారిని దేశద్రోహులుగానే పరిగణించాల్సి వస్తుందని ముథోల్ ఎమ్మెల్యే పవార్ రామారావు పటేల్ స్పష్టం చేశారు.శుక్రవారం నిర్మల్ జిల్లా బైంసా పట్టణంలోని ఎస్.ఎస్. జిన్నింగ్ ఫ్యాక్టరీ ఆవరణలో విద్యభారతి, అఖిల భారతీయ శిక్షా సంస్థాన్ (న్యూఢిల్లీ) ఆధ్వర్యంలో 'నమామి భారతం' పేరిట వందేమాతరం సామూహిక గాన కార్యక్రమాన్ని నిర్వహించారు.ఈ కార్యక్రమానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు.వందేమాతరం గేయం రచించి 150 సంవత్సరాలు పూర్తయిన సందర్భంగా,దానిని అందించిన బంకిం చంద్ర ఛటర్జీని ప్రతి ఒక్కరూ స్మరించుకోవాల్సిన అవసరం ఉందన్నారు. వందేమాతరం గేయానికి పార్లమెంట్‌లో చట్టబద్ధత కల్పించడాన్ని ఆయన గుర్తు చేశారు.తెలంగాణ అసెంబ్లీలో వందేమాతరం గీతాన్ని ఆలపిస్తున్న సమయంలో కొందరు ప్రజాప్రతినిధులు పాడకపోవడం అత్యంత విచారకరమని మండిపడ్డారు.దేశంలో ఉంటూ జాతీయ గేయాన్ని గౌరవించని వారిని దేశద్రోహులుగా భావించక తప్పదన్నారు.ఈ సామూహిక గాన మహోత్సవానికి ఇందూర్ విభాగ్ ప్రచారక్ నర్ర వెంకట శివ కుమార్ ప్రధాన వక్తగా విచ్చేశారు.పట్టణంలోని వివిధ పాఠశాలలకు చెందిన విద్యార్థులు, ఉపాధ్యాయులు పెద్ద సంఖ్యలో తరలివచ్చి దేశభక్తి భావనతో సామూహికంగా గీతాన్ని ఆలపించారు.ఈ కార్యక్రమంలో బైంసా మున్సిపల్ చైర్మన్ తుమ్మల దత్త, దేగాం సర్పంచ్ సీరం సుష్మా రెడ్డి, డా.నాగేష్, ప్రజాప్రతినిధులు, విద్యార్థులు,పార్టీ కార్యకర్తల, తదితరులు పాల్గొన్నారు.

# మద్యం మత్తులో వేధింపులు: అల్లుడిని హతమార్చిన మామ!



**ముధోల్(నిర్మల్ రూరల్) సెప్టెంబర్ 25(మన విశ్వం):** నిర్మల్ జిల్లా కేంద్రంలో ఒక ఘోర ఉదంతం వెలుగుచూసింది.మద్యం మత్తులో కుటుంబ సభ్యులను వేధిస్తున్నాడనే ఆగ్రహంతో అల్లుడిపై మామ పారతో దాడి చేసి హతమార్చాడు.పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం...జిల్లా కేంద్రంలోని సోఫీ నగర్‌కు చెందిన ఎండీ సమీర్‌కు,విశ్వనాథ్ పేటకు చెందిన నజీర్ కుమార్తెతో రెండేళ్ల క్రితం వివాహమైంది. వివాహమైన కొంతకాలం పాటు వీరి సంసారం సాఫీగానే సాగింది.అయితే, సమీర్ క్రమంగా మద్యానికి బానిసయ్యాడు.ప్రతిరోజూ మద్యం తాగి వచ్చి భార్యతో పాటు అత్తమామలను తీవ్రంగా వేధించడం మొదలుపెట్టాడు.ఈ క్రమంలోనే గురువారం అర్ధరాత్రి సమీర్ మద్యం మత్తులో మరోసారి గొడవకు దిగాడు.దీంతో తీవ్ర ఆగ్రహానికి లోనైన మామ నజీర్..ఇంట్లో ఉన్న పారతో సమీర్‌పై విచక్షణారహితంగా దాడి చేశాడు.ఈ దాడిలో సమీర్‌కు తీవ్ర గాయాలయ్యాయి. గమనించిన స్థానికులు, కుటుంబ సభ్యులు వెంటనే అతడిని చికిత్స నిమిత్తం ఆసుపత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ సమీర్ పరిస్థితి విషమించి మృతి చెందినట్లు పోలీసులు ధ్రువీకరించారు. ఘటనా స్థలాన్ని పరిశీలించిన పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు జరుపుతున్నారు.

# మంత్రి పొంగులేటి పర్యటనకు పకడ్బందీ ఏర్పాట్లు

- అధికారులు సమన్వయంతో పనిచేయాలి
- సన్నాహక సమావేశం నిర్వహించిన కలెక్టర్
- ప్రజా సమావేశం విజయవంతానికి ప్రత్యేక చర్యలు




**జనగామ, సెప్టెంబర్ 25 (మన విశ్వం):** రాష్ట్ర గృహ నిర్మాణం, రెవెన్యూ, సమాచార పౌర సంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి ఈ నెల 26న జనగామ జిల్లాలో పర్యటించనున్న నేపథ్యంలో జిల్లా యంత్రాంగం విస్తృత ఏర్పాట్లు చేపట్టింది. ఈ మేరకు జిల్లా సమీకృత కలెక్టరేట్ ప్రధాన సమావేశ మందిరంలో జిల్లా కలెక్టర్ సందీప్ కుమార్ ఝా, అదనపు కలెక్టర్ బెన్షాలోమ్, డీసీపీ రాజ మహేంద్ర నాయక్‌లతో కలిసి సన్నాహక సమావేశం నిర్వహించారు. మంత్రి పర్యటనలో ఎలాంటి లోపాలు తలెత్తకుండా అన్ని శాఖలు సమన్వయంతో పనిచేయాలని కలెక్టర్ అధికారులను ఆదేశించారు. ప్రతి బాధ్యతను క్షుణ్ణంగా నిర్వర్తించి కార్యక్రమాలను విజయవంతం చేయాలని సూచించారు.మంత్రి పర్యటనలో భాగంగా జనగామ మున్సిపాలిటీ పరిధిలో 16 నూతన చెత్త సేకరణ ఆటోలను ప్రారంభించనున్నట్లు సమావేశంలో వెల్లడించారు. అలాగే మున్సిపల్ డంపింగ్ యార్డ్ షెడ్, మురుగు నీటి శుద్ధి కేంద్రం, తహసీల్దార్ కార్యాలయ నూతన భవన నిర్మాణాలకు శంకుస్థాప నలు నిర్వహించనున్నట్లు తెలిపారు. 174 డబుల్ బెడ్‌రూమ్ ఇళ్ల గృహ ప్రవేశ కార్యక్రమంతో పాటు 500 మంది లబ్ధిదారులకు ఇందిరమ్మ ఇళ్ల మంజూరు పత్రాల పంపిణీ కూడా చేపట్ట నున్నట్లు పేర్కొన్నారు. అనంతరం ప్రజా సమావేశం నిర్వహించ నున్నట్లు అధికారులు వివరించారు.ప్రెస్టన్ కళాశాల మైదానం, మున్సిపల్ కార్యాలయ పరిసరాల్లో నిర్వహించనున్న కార్యక్రమాలకు అవసరమైన అన్ని ఏర్పాట్లను నిర్ణీత గడువులోగా పూర్తి చేయాలని కలెక్టర్ ఆదేశించారు. వేదిక నిర్మాణం, పందిళ్లు, ధ్వని వ్యవస్థ, ఎల్‌ఈడీ తెరలు, విద్యుత్ సరఫరా, జనరేటర్ సదుపాయం, తాగునీరు, పారిశుద్ధ్యం, వైద్య సేవలు, అగ్నిమాపక ఏర్పాట్లు, మీడియా కేంద్రం, సహాయ కేంద్రం, రవాణా తదితర అంశాలపై ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు. ప్రజలకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా చర్యలు తీసుకోవాలని చెప్పారు. ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారుల కోసం ప్రత్యేక సీటింగ్ బ్లాకులు, కౌంటర్లు ఏర్పాటు చేయాలని అధికారులకు సూచించారు. మండలాల వారీగా లబ్ధిదారులను టోకెన్ల ఆధారంగా తీసుకువచ్చి క్రమబద్ధంగా పంపిణీ కార్యక్రమం నిర్వహించాలని ఆదేశించారు. తహసీల్దార్లు, ఎంపీడీవోలు, ఎంపీవోలు సమన్వయంతో వ్యవహరించాలని పేర్కొన్నారు. మొత్తం కార్యక్రమ సమన్వయం, ప్రోటోకాల్ ఏర్పాట్లను ఆర్డీవో పర్యవేక్షించాలని కలెక్టర్ స్పష్టం చేశారు.మున్సిపల్ కార్యాలయం, సభా ప్రాంగణం పరిసరాల్లో పారిశుద్ధ్యం, తాగునీటి సదుపాయం, మరుగుదొడ్లు, పరిశుభ్రత చర్యలను మున్సిపల్ అధికారులు పూర్తి చేయాలని ఆదేశించారు. నిరంతర విద్యుత్ సరఫరా, జనరేటర్ బ్యాకప్, లైటింగ్ ఏర్పాట్లను విద్యుత్ శాఖ అధికారులు సిద్ధం చేయాలని సూచించారు. అత్యవసర పరిస్థితులను ఎదుర్కొనేందుకు వైద్య బృందాలు, అంబులెన్స్‌లు, అగ్నిమాపక సిబ్బందిని సిద్ధంగా ఉంచాలని చెప్పారు. ప్రజా సేవల్లో ఎలాంటి అంతరాయం కలగకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.డీసీపీ రాజ మహేంద్ర నాయక్ మాట్లాడుతూ ట్రాఫిక్ నియంత్రణ కోసం ప్రత్యేక మార్గ మళ్లింపులు అమలు చేయనున్నట్లు తెలిపారు. వీఐపీలు, అధికారులు, మీడియా ప్రతినిధులు, ప్రజల కోసం వేర్వేరు పార్కింగ్ స్థలాలను ఏర్పాటు చేస్తున్నట్లు వెల్లడించారు. సభా ప్రాంగణంలో బారికేడ్లు ఏర్పాటు చేసి ప్రవేశ, నిష్క్రమణ మార్గాలను ప్రత్యేకంగా గుర్తించనున్నట్లు చెప్పారు. జనసందోహ నియంత్రణ కోసం తగిన సంఖ్యలో పోలీసు సిబ్బందిని మోహరిస్తామని తెలిపారు. ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా అన్ని శాఖలు సమన్వయంతో పని చేసి మంత్రి పర్యటనను విజయవంతం చేయాలని అధికారులు స్పష్టం చేశారు.

# మతసామరస్యానికి నిదర్శనం: ముస్లిం యువకుడికి గణపతి లడ్డు

**మామడ లక్కీ డ్రాలో మహమ్మద్ ఆరిఫ్ పటేల్‌కు దక్కిన ప్రసాదం**



**ముధోల్ (మామడ), సెప్టెంబర్ 25(మన విశ్వం):** నిర్మల్ జిల్లా మామడ మండల కేంద్రంలో వినాయక చవితి నవరాత్రి ఉత్సవాల సందర్భంగా ఏర్పాటు చేసిన లక్కీ డ్రాలో ఒక అరుదైన సంఘటన చోటుచేసుకుంది.గంగపుత్ర సంఘం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న గణేష్ నవరాత్రి ముగింపు వేడుకల్లో భాగంగా శుక్రవారం నాడు వినాయకుడి లడ్డుకు లక్కీ డ్రా నిర్వహించారు.ఈ లక్కీ డ్రాలో స్థానిక ముస్లిం యువకుడు మహమ్మద్ ఆరిఫ్ పటేల్‌కు గణపతి లడ్డు దక్కింది.డ్రాలో తన పేరు రావడం పట్ల ఆరిఫ్ తీవ్ర ఆనందం వ్యక్తం చేశారు.వినాయకుడి ప్రసాదం తనకు లభించడం ఎంతో సంతోషంగా ఉందన్నారు.ప్రజలందరూ కులమతాలకు అతీతంగా, ఒకరినొకరు గౌరవించుకుంటూ స్నేహభావంతో మెలగాలని ఆయన ఈ సందర్భంగా ఆకాంక్షించారు.అనంతరం ఉత్సవ నిర్వాహకులు సదరు లడ్డును ఆరిఫ్‌కు ఘనంగా అందజేశారు.ఈ కార్యక్రమంలో గంగపుత్ర సంఘం పార్టీల నాయకులు,ముస్లిం పెద్దలు మరియు గ్రామస్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# అడిగేవారెవరైనా.. పురుగుమందు ఇచ్చేస్తారా?

- నిబంధనలకు విరుద్ధంగా విక్రయిస్తున్నారంటూ ఆరోపణలు
- వివరాలు తెలుసుకోకుండానే మందులు ఇస్తున్నారని స్థానికుల ఆందోళన
- నల్లబెల్లిలో పురుగుమందు సేవించి వ్యక్తి ఆత్మహత్యాయత్నం

ములుగు జిల్లా ఆసుపత్రిలో చికిత్స ఫిర్యాదు వస్తే చట్టపరమైన చర్యలు: ఏవో రజిత








**నల్లబెల్లి, సెప్టెంబర్ 25 (మన విశ్వం):** నల్లబెల్లి మండలంలో పురుగుమందుల విక్రయాల్లో నిబంధనలు గాలికొదిలేస్తున్నారనే ఆరోపణలు కలకలం రేపుతున్నాయి. కొనుగోలుదారుడి వివరాలు, వ్యవసాయ అవసరం తదితర అంశాలను నిర్ధారించకుండానే కొన్ని దుకాణాల్లో మందులు విక్రయిస్తున్నారని స్థానికులు ఆరోపిస్తున్నారు. క్షణికావేశంలో ఆత్మహత్యకు యత్నించే వారికి ఇవి సులభంగా అందుబాటులోకి వస్తున్నాయని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.ఖమ్మం జిల్లా నుంచి వచ్చి నల్లబెల్లి మండల కేంద్రంలో హోటల్ నిర్వహిస్తున్న షేక్ అమీర్ పాషా గురువారం ఆత్మహత్యకు యత్నించినట్లు సమాచారం. ఆర్థిక ఇబ్బందులతో సతమతమవుతున్న ఆయన మండల కేంద్రంలోని ఓ ఎరువుల దుకాణంలో 'హైడ్రా' పేరుతో ఉన్న బయో మందును కొనుగోలు చేసి సేవించినట్లు ఆరోపణలు ఉన్నాయి. అస్వస్థతకు గురైన అమీర్ పాషాను కుటుంబ సభ్యులు ములుగు ప్రభుత్వ జిల్లా ఆసుపత్రికి తరలించగా ప్రస్తుతం చికిత్స పొందుతున్నట్లు తెలిసింది.

ఈ ఘటనతో పురుగుమందుల విక్రయాలపై పర్యవేక్షణ అంశం మరోసారి చర్చకు వచ్చింది. కొనుగోలుదారుల వివరాలు తెలుసుకోకుండా ప్రమాదకర మందులు విక్రయిస్తే అనర్థాలకు దారితీసే అవకాశం ఉందని స్థానికులు పేర్కొంటున్నారు. మండలంలో నిబంధనల అమలును అధికారులు తనిఖీ చేసి, ఉల్లంఘనలు తేలితే చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

ఈ వ్యవహారంపై ఏవో బన్న రజితను వివరణ కోరగా, ఆధారాలు, అవసరమైన వివరాలు లేకుండా పురుగుమందుల విక్రయాలు చేపట్టకూడదని స్పష్టం చేశారు. బాధితులు ఫిర్యాదు చేస్తే నిబంధనల ప్రకారం చట్టపరమైన చర్యలు తీసుకుంటామని తెలిపారు. దుకాణంపై వచ్చిన ఆరోపణలు మాత్రం అధికారిక విచారణలో నిర్ధారణ కావాల్సి ఉంది.

# కడెం ప్రాజెక్ట్ బ్యాక్‌వాటర్‌లో వినాయక

**నిమజ్జనం:ప్రమాదవశాత్తు మునిగి ఒకరి మృతి**



**ముధోల్ (కడెం),సెప్టెంబరు 25(మన విశ్వం):** వినాయక విగ్రహ నిమజ్జన మహోత్సవాల్లో శోకం వ్యక్తమైంది.నిర్మల్ జిల్లా కడెం మండలంలో శుక్రవారం జరిగిన వినాయక నిమజ్జన వేడుకల్లో ప్రమాదవశాత్తు ఒకరు నీటిలో మునిగి ప్రాణాలు కోల్పోయారు.స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం. మండలంలోని ధర్మాజీపేట పంచాయతీ పరిధిలో గల కుర్రగూడ గ్రామస్థులు గురువారం వినాయక నవరాత్రి ఉత్సవాలను ముగించుకుని, నిమజ్జనోత్సవాలను ప్రారంభించారు.ఈ క్రమంలో శుక్రవారం కడెం ప్రాజెక్టు బ్యాక్‌వాటర్‌లో గణేశుడి విగ్రహాన్ని నిమజ్జనం చేస్తుండగా ఒక అపశ్రుతి చోటుచేసుకుంది. గ్రామానికి చెందిన చుంచు రమేష్ (45) అనే వ్యక్తి విగ్రహాన్ని నీటిలోకి తీసుకెళ్లే క్రమంలో ప్రమాదవశాత్తు లోతు భాగంలోకి వెళ్లి నీటిలో మునిగిపోయాడు. గమనించిన తోటి గ్రామస్థులు రక్షించే లోపే ఆయన అక్కడికక్కడే మృతి చెందాడు.ఈ సంఘటనతో కుర్రగూడ గ్రామంలో తీవ్ర విషాద ఛాయలు అలముకున్నాయి. సమాచారం అందుకున్న పోలీసులు ఘటన స్థలానికి చేరుకుని మృతదేహాన్ని స్వాధీనం చేసుకున్నారు. ఈ ఘటనపై కేసు నమోదు చేసుకుని దర్యాప్తు జరుపుతున్నట్లు పోలీసులు వెల్లడించారు.

# రైతు రిజిస్ట్రేషన్, యూరియా బుకింగ్‌పై అవగాహన

**కోట్ల(కె)లో సదస్సు.. హాజరైన జిల్లా వ్యవసాయ అధికారి సుజాత**



**ముధోల్(నిర్మల్ రూరల్), సెప్టెంబరు 25(మన విశ్వం):**
రైతులు ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని ఉపయోగించుకుంటూ, ప్రభుత్వం కల్పిస్తున్న సౌకర్యాలను సద్వినియోగం చేసుకోవాలని జిల్లా వ్యవసాయ అధికారి (డీఏఓ) సుజాత పేర్కొన్నారు.నిర్మల్ మండలం కోట్ల (కె) గ్రామ పంచాయతీ కార్యాలయంలో శుక్రవారం రైతు రిజిస్ట్రేషన్, యూరియా బుకింగ్ విధానాలపై రైతులకు ప్రత్యేక అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు.రైతులు తమ వివరాలను సకాలంలో రిజిస్ట్రేషన్ చేసుకోవాలని, దీనివల్ల ప్రభుత్వ పథకాలు నేరుగా అందుతాయని వివరించారు.అలాగే యూరియా కొరత లేకుండా ముందస్తుగా బుకింగ్ చేసుకునే విధానాన్ని రైతులకు క్షుణ్ణంగా అవగాహన కల్పించారు. అనంతరం గ్రామానికి విచ్చేసిన డీఏఓ సుజాతను గ్రామ సర్పంచ్ రాజు శాలువాతో ఘనంగా సన్మానించారు.ఈ కార్యక్రమంలో ఉపసర్పంచ్ రఘు,మండల వ్యవసాయ అధికారి అంబాజీ, పంచాయతీ కార్యదర్శి లక్ష్మణ్, వ్యవసాయ శాఖ సిబ్బంది మరియు స్థానిక రైతులు, గ్రామ పంచాయతీ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రి పనుల పరిశీలన

**- క్షేత్రస్థాయిలో పురోగతిని పరిశీలించిన రాష్ట్ర ఉన్నతాధికారులు**
**- అధికారులను మర్యాదపూర్వకంగా కలిసిన వరంగల్ సీపీ ఎన్. శ్వేత**



**వరంగల్, సెప్టెంబర్ 25 (మన విశ్వం):** వరంగల్ నగరంలో నిర్మాణంలో ఉన్న సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రి పనుల పురోగతిని రాష్ట్ర ప్రభుత్వ ఉన్నతాధికారులు శుక్రవారం క్షేత్రస్థాయిలో పరిశీలించారు. నిర్మాణ ప్రాంగణాన్ని సందర్శించి పనుల స్థితిగతులను పరిశీలించారు.ప్రభుత్వ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి, రవాణా, రోడ్లు–భవనాల శాఖకు చెందిన వికాస్ రాజ్, సీఎంఓ ముఖ్య కార్యదర్శి ఎన్. శ్రీధర్, సీఎంఓ కార్యదర్శి కె. మాణిక్ రాజ్, ఆర్థిక, ప్రణాళిక శాఖ కార్యదర్శి డాక్టర్ గౌరవ్ ఉప్పల్ తదితరులు ఆసుపత్రి నిర్మాణ ప్రాంగణాన్ని సందర్శించారు.ఈ సందర్భంగా వరంగల్ పోలీస్ కమిషనర్ ఎన్. శ్వేత, ఐపీఎస్ ఉన్నతాధికారులను మర్యాదపూర్వకంగా కలిసి మొక్కను అందించి సాదరంగా స్వాగతం పలికారు.

# ఘనంగా గణనాథుల నిమజ్జనం



**మక్తల్/మక్తల్ రూరల్/ నారాయణపేట క్రైం, సెప్టెం బరు 25 ():** మ క్తల్ పట్టణంలో 11 రోజులపాటు పూజలందుకున్న గణనాథులను శుక్రవారం భక్తిశ్రద్ధలతో స్థానిక పెద్ద చెరువులో నిమజ్జనం చేశారు. ప ట్టణంలో 50కి పైగా ఉన్న విగ్రహాలను ఆయా మండపాల నుంచి ఊరేగింపుగా తరలించారు. భజనలు, కోలాటం, దాండియా నృత్యాలతో అల రించారు. వీహెచ్‌పీ, భజరంగదళ్ ఆధ్వర్యంలో ఆజాద్‌నగర్ చౌరస్తాలో స్వాగతవేదిక ఏర్పాటు చేశారు. బాలగంగాధర్ చిత్రపటానికి నివాళ్లు అర్పించారు. ప్రతీ మండపం నిర్వాహకులను వీహెచ్‌పీ నాయకులు శాలువా, మెమెంటోతో సత్కరించారు. హాజరైన క్రీడా శాఖ మంత్రి వాకిటి శ్రీహరి మాట్లాడుతూ భక్తిశ్రద్ధలతో నిమజ్జన వేడుకలు నిర్వహించాలన్నారు. పెద్ద చెరువు వద్ద క్రెయిన్ సహాయంతో గణనాథులను నిమజ్జనం చేశారు. అంతకుముందు ఆయా మండ పాల వద్ద లడ్డూ వేలం పాటలు నిర్వహించారు. ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా నిమజ్జన ఊరేగింపు మార్గాల్లో సీసీ కెమెరాల ని ఘా, వీడియో రికార్డింగ్ చేపట్టారు. డీఎస్పీ లింగయ్య, సీఐ రాంలాల్, ఎస్ఐ పి.రాజు ఆధ్వర్యం లో 150మంది పోలీస్ సిబ్బందితో గట్టి బందో బస్తు నిర్వహించారు. అంతకుముందు బందోబ స్తు విధులకు వచ్చిన పోలీసులు, అధికారులు, సిబ్బందికి ఎస్పీ డాక్టర్ వినీత్ మక్తల్ పట్టణంలోని రాయల్ ఫంక్షన్ హాల్‌లో సమావేశం నిర్వ హించి, భద్రతా సూచనలు చేశారు. అనంతరం మక్తల్ మినీ ట్యాంక్ బండ్ నిమజ్జన ప్రాంతాన్ని పరిశీలించారు. నారాయణపేటలో ఎస్పీ డ్రోన్ ద్వారా శోభా యాత్రను పరిశీలించి, కమ్యూనికేషన్ వ్యవస్థ (మ్యాన్‌ప్యాక్) ద్వారా ప్రార్థనా మందిరాలు, చౌరస్తా, నిమజ్జన ప్రదేశంలో బందోబస్తులో ఉన్న సిబ్బందికి సూచనలు, సలహాలు చేశారు.

# పెచ్చులూడుతున్న పైకప్పు.. పిల్లలకు పొంచిన ముప్పు!

**- శిథిలావస్థకు చేరిన కైలాష్‌నగర్ అంగన్‌వాడీ కేంద్రం**
**- ఎప్పుడు ఏ ప్రమాదం జరుగుతుందోనని సిబ్బంది ఆందోళన**
**- కొత్త భవనానికి నిధులు మంజూరు చేయిస్తానన్న ఎమ్మెల్యే పాయల్ శంకర్**




**ఆదిలాబాద్, సెప్టెంబర్ 25 (మన విశ్వం):**
ఆదిలాబాద్ జిల్లా కేంద్రంలోని కైలాష్‌నగర్ అంగన్‌వాడీ కేంద్రం శిథిలావస్థకు చేరి చిన్నారులకు ప్రమాదకరంగా మారింది. భవనం పైకప్పు నుంచి పెచ్చులు ఊడిపడుతుండటంతో ఎప్పుడు ఏ ప్రమాదం జరుగుతుందోనని అంగన్‌వాడీ సిబ్బంది ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.ఈ సమస్యను అంగన్‌వాడీ టీచర్, ఆయాలు ఆదిలాబాద్ ఎమ్మెల్యే పాయల్ శంకర్ దృష్టికి తీసుకెళ్లారు. దీనిపై స్పందించిన ఎమ్మెల్యే అంగన్‌వాడీ కేంద్రం పరిస్థితిని అసెంబ్లీలో ప్రస్తావిస్తానని, నూతన భవన నిర్మాణానికి నిధులు మంజూరయ్యేలా కృషి చేస్తానని హామీ ఇచ్చారు.అనంతరం అం గన్‌వాడీ కేంద్రంలో విధులు నిర్వహిస్తున్న సిబ్బందిని ఎమ్మెల్యే శాలువాలతో సత్కరించారు. కార్యక్రమంలో ఆదినాథ్, బీజేపీ నాయకులు, , కైలాష్‌నగర్ వార్డు సభ్యులు పాల్గొన్నారు.

# బెజ్జూరులో సీఎం సహాయనిధి చెక్కుల పంపిణీ



**కొమరం భీం, సెప్టెంబర్ 25 (మన విశ్వం):** బెజ్జూరు మండలంలోని పలు గ్రామాలకు చెందిన లబ్ధిదారులకు ప్రభుత్వం నుంచి మంజూరైన ముఖ్యమంత్రి సహాయనిధి (సీఎంఆర్ఎఫ్) చెక్కులను శుక్రవారం పంపిణీ చేశారు.సిర్పూర్ ఎమ్మెల్యే డాక్టర్ పాల్వాయి హరీష్ బాబు ఆదేశాల మేరకు బీజేపీ నాయకులు లబ్ధిదారులకు చెక్కులను అందజేశారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు సామల తిరుపతి, మాజీ సర్పంచులు వసీవుల్లా ఖాన్, రాకేష్, కిష్టయ్య, జాడి దిగంబర్, శ్యాంసుందర్ తదితరులు పాల్గొన్నారు.

# శ్రీరంగనాయక స్వామి ఆలయంలో చోరీ



**శ్రీరంగాపురం,సెప్టెంబరు 25** : వనపర్తి జి ల్లా శ్రీరంగాపురం మండల కేంద్రంలోని శ్రీరంగనాథ ఆలయం లో పంచలోహ (రాముడు, లక్ష్మణుడు, ఆంజనేయస్వామి) వి గ్రహాలను దుండగులు ఎత్తుకెళ్లారు. శుక్రవారం ఎస్పీ సునీ తారెడ్డి, వనపర్తి డీఎస్పీ గిరిబాబు, కొత్తకోట సీఐ ఓడి రమే ష్‌తో కలిసి సంఘటన స్థలాన్ని పరిశీలించారు. ఈ సందర్భం గా ఆమె మాట్లాడుతూ శుక్రవారం తెల్లవారు జామున మూ డు పంచలోహ విగ్రహాలు, ఒక చిన్నపాటి వెండి కిరీటం గుర్తు తెలి యని వ్యక్తులు ఎత్తుకెళ్లారని ఎస్పీ తెలిపారు. ఆలయ ట్రస్టు అధి కారులు మదన్మోహన్, వినయ్‌లు ఫిర్యాదు చేశారని కొత్తకోట సీఐ ఓ డి రమేష్ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పెబ్బేరు ఎస్ఐ వెంకటేష్‌గౌడ్, పెద్దమందడి ఎస్ఐ జలందర్ బృందం రెండు బృందాలుగా దర్యాప్తు చేపట్టామని ఆయన తెలిపారు. ఆలయ అర్చకు లు ఆలయ సిబ్బందిని విచారిస్తున్నామని ఆయన తెలిపారు. కేసును దర్యాప్తు చేస్తున్నామని దుండగులను తొందర్లలోనే పట్టుకొని జైలు పంపుతామని సీఐ రమేష్ తెలిపారు. శ్రీరంగాపూర్ ఎస్ఐ హిమబిం దు, ఏఎస్ఐ మన్యపురెడ్డి, పోలీస్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# ఎంజీఎం సమస్యలపై ప్రశ్నిస్తే పోలీసుల దాడులా?

**- ప్రజాగొంతుకను అణచివేయడం ఆపాలి**
**- వినయ్ భాస్కర్‌పై ఘటనకు బాధ్యులపై చర్యలు తీసుకోవాలి**
**- ఎంజీఎం భవనాలను పూర్తిస్థాయిలో తనిఖీ చేయాలి**
**- బీఆర్ఎస్వీ రాష్ట్ర నాయకుడు అర్షం మధుకర్**



**ఆత్మకూరు, సెప్టెంబర్ 25 (మన విశ్వం):**
వరంగల్ ఎంజీఎం ఆస్పత్రిలో పెచ్చులూడి రోగులు గాయపడిన ఘటనపై ప్రశ్నించేందుకు, బాధితుల ను పరామర్శించేందుకు వెళ్లిన మాజీ ఎమ్మెల్యే వినయ్ భాస్కర్‌పై పోలీసులు దాడి చేశారని బీఆర్ఎస్వీ రాష్ట్ర నాయకుడు అర్షం మధుకర్ ఆరోపించారు. ప్రజా సమస్యలపై ప్రశ్నించే గొంతులను అణచివేసే ధోరణి సరికాదన్నారు.శుక్రవారం తన స్వగృహంలో విడుదల చేసిన ప్రకటనలో మధుకర్ మాట్లాడుతూ, వినయ్ భాస్కర్‌ను పోలీసులు అడ్డుకోవడంతో పాటు దాడి చేశారని ఆరోపించారు. ఎంజీఎంలో రోగుల భద్రతపై ప్రశ్నించడం తప్పా? ఆస్పత్రి భవనాల నిర్వహణను పర్యవేక్షించాల్సిన అధికారులు ఏం చేస్తున్నారని ప్రశ్నించారు. ఘటనపై వైద్య ఆరోగ్యశాఖ మంత్రి, ముఖ్యమంత్రి సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు.ఎంజీఎం భవనాలను పూర్తిస్థాయిలో తనిఖీ చేసి ప్రమాదకర ప్రాంతాలను గుర్తించాలని, అవసరమైన మరమ్మతులను యుద్ధప్రాతిపదికన చేపట్టాలని కోరారు. ప్రభుత్వ ఆస్పత్రుల్లో రోగులకు మెరుగైన మౌలిక సదుపాయాలు, భద్రతతో పాటు నాణ్యమైన ఉచిత వైద్యం అందేలా చర్యలు తీసుకోవాలన్నారు.సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రిని ఎప్పుడు ప్రారంభిస్తారు?వరంగల్ సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రిని పూర్తిస్థాయిలో ప్రజలకు ఎప్పుడు అందుబాటులోకి తీసుకొస్తారో ప్రభుత్వం స్పష్టం చేయాలని మధుకర్ డిమాండ్ చేశారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో ఆస్పత్రి నిర్మాణానికి చర్యలు చేపట్టామని పేర్కొంటూ, ప్రస్తుత ప్రభుత్వం పనులను వేగంగా పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని కోరారు.వినయ్ భాస్కర్‌కు సంబంధించిన ఘటనపై సమగ్ర విచారణ జరిపి, బాధ్యులుగా తేలిన వారిపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ప్రజా సమస్యలను లేవనెత్తేవారిని అడ్డుకోవడం కంటే వాటికి పరిష్కారం చూపడంపై ప్రభుత్వం దృష్టి పెట్టాలని మధుకర్ కోరారు.

# మాచాపూర్ విద్యార్థినికి రూ.లక్ష ప్రోత్సాహకం!

**పదో తరగతి ప్రతిభకు శ్రీరామ్ లైఫ్ 'చదువుకో తెలంగాణ' పురస్కారం**
**నియోజకవర్గ టాపర్‌గా బోనగిరి నందినికి ఘన సత్కారం**




**ఎల్లారెడ్డి, సెప్టెంబర్25 (మన విశ్వం):**పదో తరగతిలో ప్రతిభ కనబరిచిన మాచాపూర్ జడ్పీహెచ్ఎస్ విద్యార్థినికి అరుదైన గౌరవం దక్కింది. ఎల్లారెడ్డి మండలం మల్లయ్యపల్లి గ్రామానికి చెందిన బోనగిరి అంజయ్య కుమార్తె బోనగిరి నందిని ఎల్లారెడ్డి నియోజకవర్గ టాపర్‌గా నిలిచి రూ.లక్ష ఉపకార వేతనం అందుకున్నారు. శ్రీరామ్ లైఫ్ ఇన్సూరెన్స్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న 'చదువుకో తెలంగాణ' కార్యక్రమంలో భాగంగా గురువారం హైదరాబాద్ గచ్చిబౌలిలోని ఇంజినీరింగ్ స్టాఫ్ కాలేజీలో నిర్వహించిన కార్యక్రమంలో గవర్నర్ శివప్రతాప్ శుక్లా, సంస్థ ప్రతినిధుల చేతుల మీదుగా నందిని ఈ పురస్కారాన్ని అందుకున్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో చదివి 2025--26 విద్యా సంవత్సరంలో పదో తరగతిలో అత్యుత్తమ ప్రతిభ కనబరిచిన విద్యార్థులను ప్రోత్సహించేందుకు ఈ ఉపకార వేతనాలు అందిస్తున్నట్లు శ్రీరామ్ లైఫ్ ఇన్సూరెన్స్ మేనేజింగ్ డైరెక్టర్ కాస్పరస్ జాకోబస్ హెండ్రిక్ క్రోమ్‌హౌట్ తెలిపారు. రాష్ట్రవ్యాప్తంగా 632 మంది విద్యార్థులను ఎంపిక చేయగా, తొలి విడతలో 134 మందికి ఉపకార వేతనాలు అందించినట్లు పేర్కొన్నారు. రాష్ట్ర టాపర్‌కు రూ.5 లక్షలు, రెండో స్థానానికి రూ.3 లక్షలు, జిల్లా టాపర్లకు రూ.2 లక్షలు, నియోజకవర్గ టాపర్లకు రూ.లక్ష చొప్పున ప్రోత్సాహకాలు అందిస్తున్నట్లు తెలిపారు. ప్రభుత్వ పాఠశాలల్లో చదివి పదో తరగతిలో టాపర్లుగా నిలిచిన విద్యార్థులకు మొత్తంగా రూ.2.2 కోట్ల ప్రోత్సాహకాలు అందించనున్నట్లు వెల్లడించారు. ఎల్లారెడ్డి నియోజకవర్గ టాపర్‌గా నిలిచి రూ.లక్ష పురస్కారం అందుకున్న నందినిని గ్రామస్థులు, ఉపాధ్యాయులు అభినందించారు.



# అదరగొట్టిన భారత కబడ్డీ జట్టు.. ఫైనల్స్‌కి దూసుకెళ్లింది..

ఐచి: ఆసియా క్రీడల్లో భారత పురుష, మహిళ కబడ్డీ జట్లు అదరగొడుతున్నాయి. ఇప్పటికే మహిళ జట్టు ఫైనల్స్‌కి దూసుకెళ్లగా.. తాజాగా పురుషుల జట్టు ఫైనల్స్‌కు చేరింది. శుక్రవారం ఐచి వేదికగా థాయ్‌లాండ్‌తో జరిగిన పోరులో ఘన విజయం సాధించి తుది పోరుకు చేరుకుంది. థాయ్‌లాండ్‌పై భారత్ 66-28 స్కోర్‌తో ఘన విజయం సాధించింది. దీంతో ఈ ప్రతిష్టాత్మక క్రీడల్లో భారత్‌కు మరో పతకం ఖాయమైంది. శనివారం జరిగే ఫైనల్ పోరులో భారత పురుషుల కబడ్డీ జట్టు తైవాన్ లేదా ఇరాన్‌తో తలపడే అవకాశముంది. అంతకు ముందు భారత మహిళల కబడ్డీ జట్టు కూడా సత్తా చాటింది. సెమీ ఫైనల్‌లో నేపాల్‌ను 48-24 తేడాతో భారత్ చిత్తు చేసింది. కాగా టోర్నమెంట్‌లో మెన్స్, ఉమెన్స్ కబడ్డీ జట్లు ఇప్పటివరకు ఒక్క మ్యాచ్‌లో కూడా ఓడిపోలేదు.

# ఆసియా క్రీడలు.. ఆఫ్ఘనిస్థాన్‌పై నేపాల్ ఘన విజయం

ఆసియా క్రీడల్లో భాగంగా శుక్రవారం అఫ్ఘనిస్తాన్‌తో జరిగిన మ్యాచ్‌లో నేపాల్ 5 వికెట్ల తేడాతో ఘన విజయం సాధించింది. ఈ మ్యాచ్‌లో తొలుత బ్యాటింగ్ చేసిన అఫ్గానిస్థాన్ నిర్ణీత 20 ఓవర్లలో 7 వికెట్లు కోల్పోయి 102 పరుగులు మాత్రమే చేసింది. అఫ్గాన్ బ్యాటింగ్‌లో ఫైజల్ ఖాన్ 30, నజీబుల్లా జద్రాన్ 30 మినహా మిగితా వాళ్లందరూ సింగిల్ డిజిట్ స్కోర్‌కే పరిమితమయ్యారు. నేపాల్ బౌలింగ్‌లో కౌషల్ భుర్టెల్ 4 వికెట్లు, లలిత్ రాజ్‌బాన్సీ 3 వికెట్లు




తీశారు. ఆ తర్వాత ఈ లక్ష్యాన్ని 17.2 ఓవర్లలో చేధించింది. నేపాల్ బ్యాటింగ్2లో సందీప్ జోరా 34, రోహిత్ పౌడెల్ 33(నాటౌట్) రాణించారు. అఫ్గాన్ బౌలింగ్‌లో ఫరిదూన్, అద్బొల్లా, అరబ్ గుల్ తలో వికెట్ తీశారు.

# విండీస్‌తో తొలి వన్డే.. సచిన్ రికార్డును కోహ్లీ బ్రేక్ చేస్తాడా?



వెస్టిండీస్ జట్టుతో ఆదివారం నుంచి టీం ఇండియా వన్డే సిరీస్‌లో తలపడనుంది. తొలి వన్డే తిరువనంతపురం వేదికగా జరగనుంది. ఇప్పటికే అక్కడకు చేరుకున్న భారత జట్టు ప్రాక్టీస్ ప్రారంభించింది. అయితే ఈ తొలి మ్యాచ్‌లో టీం ఇండియా పరుగుల రారాజు విరాట్ కోహ్లీ ఓ ప్రపంచ రికార్డును బ్రేక్ చేసే అవకాశం ఉంది. అది ప్రస్తుతం భారత దిగ్గజ క్రికెటర్ సచిన్ టెండూల్కర్ పేరిట ఉంది. తిరువనంతపురంలో జరిగే వన్డేలో కోహ్లీ మరో 59 పరుగులు చేస్తే.. అంతర్జాతీయ వన్డేల్లో అత్యంత వేగంగా 15,000 పరుగులు పూర్తి చేసుకున్న క్రికెటర్‌గా ప్రపంచ రికార్డు సృష్టిస్తాడు. విరాట్ ఇప్పటివరకూ 311 ఇన్నింగ్స్‌లో 14,941 పరుగులు చేశాడు. సచిన్ టెండూల్కర్ 377 ఇన్నింగ్స్‌లో ఈ మైలురాయి చేరుకున్నారు. మరోవైపు మాజీ కెప్టెన్ రోహిత్ శర్మ కూడా ఓ మైలురాయికి చేరువలో ఉన్నాడు. ఈ మ్యాచ్‌లో రోహిత్ 105 పరుగులు చేస్తే.. వన్డేల్లో 12,000 పరుగుల మైలురాయిని చేరుకుంటాడు. మరి విరాట్-రోహిత్ ఈ రికార్డులు సాధిస్తారో లేదో చూడాలి.

# ఆసియా క్రీడలు.. భారత్‌కు రెండో స్వర్ణ పతకం..




జపాన్‌లో ఆసియా క్రీడలు 2026 ఘనంగా జరుగుతున్నాయి. ఈ క్రీడల్లో తమ అత్యుత్తమ ప్రదర్శన కనబర్చడంలో అథ్లెట్లు పోటీ పడుతున్నారు. కాగా, ఇప్పటికే భారత్‌కు క్రికెట్‌లో స్వర్ణపతకం లభించిన విషయం తెలిసిందే. ఇప్పుడు మన దేశానికి మరో స్వర్ణ పతకం లభించింది. షూటింగ్ విభాగంలో తొలుత మను బాకర్ వంటి స్టార్ షూటర్లు నిరాశ పరిచినా.. ఇప్పుడు ఏకంగా గోల్డ్ మెడల్ దక్కింద. 10 మీటర్ల ఎయిర్ పిస్టల్ మిక్స్‌డ్ టీమ్ ఈవట?ంలో భారత షూటర్లు కమల్‌జీత్, సురుచి సింగ్ స్వర్ణం సాధించారు. దీంతో ఈ క్రీడల్లో భారత్‌కు రెండో పసిడి పతకం లభించింది. ఈ విభాగం మెడల్ రౌండ్‌లో మొత్తం నాలుగు జోడీలు ఫైనల్2కు అర్హత సాధించారు. ఇందులో కమల్‌జీత్, సురుచి కలిసి మొత్తంగా 484.6 పాయింట్లతో అగ్రస్థానంలో నిలిచారు. దక్షిణ కొరియా ద్వయానికి రజతం, ఇరాన్ జోడీకి కాంస్యం దక్కాయి.

# రజనీకాంత్ 'జైలర్-2' పాటకు డేవిడ్ వార్నర్ డ్యాన్స్ చేస్తే..



ఆసీస్ క్రికెటర్ డేవిడ్ వార్నర్ అంటే క్రికెట్ అభిమానులకే కాదు.. సినీ ప్రియులకు కూడా ఎంతో ఇష్టం. లాక్‌డౌన్ సమయంలో ఆయన పలు పాటలకు డ్యాన్స్‌లు చేస్తూ అప్‌లోడ్ చేసిన వీడియో ఎంతో వైరల్ అయ్యాడు. ఆ తర్వాత నుంచి వార్నర్‌ని డేవిడ్ భాయ్ అని పిలవడం ఫ్యాన్స్‌కి అలవాటు అయింది. గత ఏడాది నితిన్ హీరోగా వచ్చిన 'రాబిన్‌హుడ్' అనే సినిమాలో ఈ ప్రత్యేక పాత్రలో కనిపించారు వార్నర్. అయితే ఆ సినిమా ఊహించినంత సక్సెస్ సాధించలేదు.ఇప్పుడు డేవిడ్ వార్నర్ మరో వీడియోతో ఫ్యాన్స్ ముందుకొచ్చారు. 'జైలర్-2' చిత్రంలోని 'అల బోలేలో' పాటకి వార్నర్ డ్యాన్స్ చేస్తే ఎలా ఉంటుందో అనేలా ఓ ఎఐ వీడియోని క్రియేట్ చేశారు. దీన్ని వార్నర్ తన ఇన్‌స్టాగ్రామ్‌లో పోస్ట్ చేశాడు. "ఇది ఎవరు చేశారో నాకు తెలీదు.. కానీ, నా డ్యాన్స్‌కు ఎన్ని మార్కులు ఇస్తారు' అని క్యాప్షన్ పెట్టాడు. దీనిపై అభిమానులు రకరకాలుగా కామెంట్లు చేస్తున్నారు.




# మన్‌ప్రీత్ కౌర్‌కు కాంస్యం

-హైదరాబాద్: ఆసియా క్రీడల్లో మహిళల షాట్ పుట్ విభాగంలో భారత్‌కు చెందిన మన్‌ప్రీత్ కౌర్ కాంస్య పతకాన్ని గెలుచుకుంది. మన్‌ప్రీత్ తన నాల్గో ప్రయత్నంలో 17.17 మీటర్ల అత్యుత్తమ దూరాన్ని నమోదు చేసి పతకాన్ని ఖరారు చేసుకున్నారు. చైనాకు చెందిన సాంగ్ జియాయువాన్ 19.40 మీటర్ల ప్రదర్శనతో స్వర్ణాన్ని, అదే దేశానికి చెందిన జాంగ్ లిన్‌రు 18.14 మీటర్లతో రజతాన్ని కైవసం చేసుకున్నారు. ఇదే ఈవెంట్‌లో మరో భారత క్రీడాకారిణి కృష్ణ జయశంకర్ మీనన్ ఐదవ స్థానంలో నిలిచారు.

# తొలి రౌండ్‌లోనే సాత్విక్-చిరాగ్ ఓటమి

హైదరాబాద్: ఆసియా క్రీడల పురుషుల డబుల్స్ బ్యాడ్మింటన్ విభాగంలో డిఫెండింగ్ ఛాంపియన్స్ సాత్విక్‌సాయిరాజ్ రెడ్డి చిరాగ్ శెట్టి తొలి రౌండ్‌లోనే నిష్క్రమించారు. శుక్రవారం జరిగిన మ్యాచ్‌లో థాయిలాండ్‌కు చెందిన సుక్‌ఫున్, పక్కపోన్ టీరారత్సాకుల్ జోడీ చేతిలో ఓడిపోయారు. ఊహించని విధంగా నాలుగో సీడ్ హోదాలో బరిలోకి దిగిన ఈ భారత జోడీ, 21-12, 19-21, 14-21 తేడాతో ఓటమిని చవిచూసింది.





# ఆసియా క్రీడల్లో భారత్‌కు మరో స్వర్ణం

హైదరాబాద్ : ఐచీ-నగోయా ఆసియా గేమ్స్‌లో ఆరో రోజు భారత్‌కు అద్భుతమైన ఆరంభం లభించింది. షూటర్లు సత్తా చాటడంతో భారత్ ఖాతాలో ఒక స్వర్ణం, ఒక రజతం చేరాయి. 10 మీటర్ల ఎయిర్ పిస్టల్ మిక్స్‌డ్ టీమ్ ఫైనల్‌లో సురుచి, కమల్‌జీత్ జోడీ పసిడి పతకాన్ని ముద్దాడింది. పురుషుల 50 మీటర్ల రైఫిల్ 3 పొజిషన్స్ టీమ్ ఈవెంట్‌లో ఐశ్వరీ ప్రతాప్ సింగ్ తోమర్, నీరజ్ కుమార్, రుద్రాంక్ష్ పాటిల్‌తో కూడిన జట్టు రజత పతకాన్ని కైవసం చేసుకుంది. ఈ విజయంతో దేశ పతకాల సంఖ్య 19కి చేరింది. మరోవైపు, స్వర్ణం గెలిచిన సురుచి-కమల్‌జీత్ జోడీ, క్వాలిఫికేషన్ రౌండ్‌లో ఆసియా రికార్డును సమం చేయడం విశేషం



# అప్పుడు కాంస్యం.. ఇప్పుడు రజతం.. మారథాన్‌లో మళ్లీ మెరిసిన గుల్వీర్..!

జపాన్‌లోని నగోయలో జరుగుతున్న ఆసియా క్రీడల్లో భారత అథ్లెట్లు మెరుస్తున్నారు. పురుషుల100 మీటర్ల పరుగులో గురిందెర్వీర్ సింగ్, అనిమేశ్ కుజుర్‌లు నిరాశపరిచినా.. 'నేనున్నాంటూ' మారథాన్ పరుగులో గుల్వీర్ సింగ్ పతకంతో మెరిశాడు. 10 వేల మీటర్లలో సత్తా చాటిన గుల్వీర్ రెండో స్థానంలో నిలిచి దేశానికి సిల్వర్ మెడల్ అందించాడు. దాంతో.. ఆసియాడ్‌లో వరసగా రెండో పతకం ఖాతాలో వేసుకున్నాడీ రన్నర్. 2023లో హంగ్జూలో గుల్వీర్ కాంస్యం సాధించాడు.పద్దెనిమిదో ఆసియా క్రీడల్లో భారత అథ్లెట్ గుల్వీర్ సింగ్ వెండి వెలుగులు విరజిమ్మాడు. పురుషుల 10 వేల మీటర్ల పరుగులో అసమాన పట్టుదలను ప్రదర్శించిన అతడు సిల్వర్ మెడల్ సాధించాడు. ఆసియాడ్ వంటి పెద్ద వేదికలపై నేను ఎప్పుడూ నిరాశపరచను అని చాటుతూ పోడియం మీద సగర్వంగా నిలబడ్డాడీ రన్నర్. శుక్రవారం జరిగిన పురుషుల 10 వేల మీటర్ల పరుగులో గుల్వీర్ 28:29.38 నిమిషాల్లో లక్ష్యాన్ని చేరుకున్నాడు. అతడి కంటే 1.87 సెకన్ల ముందుగా పరుగు పూర్తి చేసిన బిర్హను బలెవ్(బహ్రెయిన్) స్వర్ణం ఎగరేసుకుపోయాడు.

మన విశ్వం
VOICE OF THE PEOPLE-POWER OF TRUTH
తెలుగు వార్తా దినపత్రిక



# ‘ది ప్యారడైజ్’లో కయాదు లోహర్ పాత్రపై విమర్శలు.. శ్రీకాంత్ ఓదెలకి నెటిజన్ల ప్రశ్నలు



నేచురల్ స్టార్ నాని నటించిన ‘ది ప్యారడైజ్’కు విడుదల తర్వాత మిశ్రమ స్పందన వస్తోంది. సినిమా కథ, నాని నటన, యాక్షన్ సన్నివేశాలపై భిన్నాభిప్రాయాలు వ్యక్తమవుతున్నప్పటికీ.. ఈ చిత్రంలో కయాదు లోహర్ పోషించిన సుబ్బు పాత్ర మాత్రం ప్రత్యేకంగా చర్చకు వచ్చింది. ముఖ్యంగా ఆ పాత్రను దర్శకుడు శ్రీకాంత్ ఓదెల తెరకెక్కించిన విధానంపై సోషల్ మీడియాలో విమర్శలు వ్యక్తమవుతున్నాయి. సినిమాలో సుబ్బు పాత్రకు సినీ నటి కావాలనే కోరిక ఉంటుంది. తల్లి వద్దని వారించినా మద్రాస్ వెళ్లి సినిమాల్లో అవకాశాల కోసం ప్రయత్నిస్తుంది. అయితే అనుకున్న స్థాయిలో అవకాశాలు రాకపోవడంతో తీవ్ర నిరాశకు గురవుతుంది. అదే సమయంలో తన తండ్రి చేసిన అప్పుల కారణంగా కుటుంబం ఎదుర్కొంటున్న అవమానాలను చూస్తుంది. ఎలాగైనా ఆ అప్పులు తీర్చాలని నిర్ణయించుకున్న సుబ్బు.. డబ్బు కోసం బీ గ్రేడ్ చిత్రాల్లో నటించడం ప్రారంభిస్తుంది. ఇక్కడే ‘ది ప్యారడైజ్’లోని కొన్ని సన్నివేశాలపై ప్రేక్షకుల నుంచి అభ్యంతరాలు వ్యక్తమవుతున్నాయి. సుబ్బు నటించే బీ గ్రేడ్ చిత్రాలకు ‘చుక్క చిత్రాలు’ అనే పేరు పెట్టడం, వాటిని ప్రదర్శించే సన్నివేశాల్లో హీరోయిన్ పాత్రను చూపించిన తీరు అవసరానికి మించి గ్లామర్‌ను ప్రధానంగా చూపించిందని కొందరు ప్రేక్షకులు అభిప్రాయపడుతున్నారు. కథలో ఆ పాత్ర ఎదుర్కొంటున్న బాధ, పరిస్థితుల తీవ్రత ప్రేక్షకులకు బలంగా కనెక్ట్ కావాల్సిన చోట.. కొన్ని సన్నివేశాలు వేరే విధంగా స్పందన తెచ్చుకున్నాయని సోషల్ మీడియాలో చర్చ జరుగుతోంది. మరోవైపు సుబ్బు నడుముపై ఉండే సీతాకోకచిలుక టాటూ కూడా కథలో కీలకంగా ఉపయోగించారు. బీ గ్రేడ్ చిత్రాల్లో ఆమె ముఖాన్ని చూపించకుండా ఆ టాటూ ద్వారా గుర్తుపట్టేలా సన్నివేశాలను రూపొందించారు. అయితే ఆ విషయాన్ని హీరో తెలుసుకున్న తర్వాత వచ్చే సన్నివేశంలో నాని చెప్పే కొన్ని సంభాషణలపైనా విమర్శలు వచ్చాయి. ముఖ్యంగా మహిళలను అవమానించేలా అనిపించే పదజాలాన్ని ఉపయోగించడంపై కొందరు ప్రేక్షకులు అభ్యంతరం వ్యక్తం చేస్తున్నారు. వాస్తవానికి సుబ్బు పాత్ర వెనుక ఉన్న ఉద్దేశం భావోద్వేగంగా ప్రేక్షకులను కదిలించడమే అయి ఉండొచ్చనే అభిప్రాయాలు కూడా వినిపిస్తున్నాయి. కుటుంబ అప్పులు తీర్చడానికి ఒక యువతి తనకు ఇష్టం లేని మార్గంలోకి వెళ్లాల్సి రావడం, ఆ తర్వాత ఆ విషయం హీరోకు తెలియడం వంటి అంశాలతో బలమైన భావోద్వేగాన్ని పండించాలని దర్శకుడు ప్రయత్నించినట్లు కనిపిస్తోంది. అయితే ఆ సన్నివేశాల చిత్రీకరణ కారణంగా ఆశించిన భావోద్వేగం కంటే భిన్నమైన స్పందన వచ్చిందని కొందరు ప్రేక్షకులు అంటున్నారు. సోషల్ మీడియాలో కొంతమంది కయాదు లోహర్ సన్నివేశాలనే సినిమాకు సంబంధించిన చర్చలో ప్రధాన అంశంగా మార్చుకుని ట్రోల్ చేస్తున్నారు. మరికొందరు మాత్రం ఆ పాత్రను విమర్శించాల్సిన అవసరం లేదని, పాత్రను ఎలా రాశారు, ఎలా చూపించారు అనే అంశంపైనే చర్చ జరగాలని అంటున్నారు. అంటే.. విమర్శల ప్రధాన కేంద్రం కయాదు లోహర్ కాదు, ఆమె పాత్రను తెరపై ఆవిష్కరించిన విధానమే అన్నది వారి అభిప్రాయం.

# ‘పార్కింగ్’ దర్శకుడితో శివకార్తికేయన్ కొత్త సినిమా.. పూజా కార్యక్రమాలతో లాంచ్!




ఈ చిత్రంలో శివకార్తికేయన్ సరసన కయాదు లోహర్ హీరోయిన్‌గా నటిస్తుండగా, యువ సంగీత సంచలనం సాయి అభ్యాంకర్ ఈ సినిమాకు సంగీతం అందిస్తున్నట్లు సమాచారం. పర్ఫెక్ట్ కమర్షియల్ ఎంటర్‌టైనర్‌గా తెరకెక్కుతున్న ఈ ప్రాజెక్ట్‌పై కోలీవుడ్‌లో భారీ అంచనాలు నెలకొన్నాయి. శివకార్తికేయన్ తన తదుపరి సినిమాలతో పాటు ఈ ‘ఎస్కే27’ షూటింగ్ షెడ్యూల్స్‌ను కూడా బ్యాలెన్స్ చేయనున్నారు. కోలీవుడ్ టాలెంటెడ్ హీరో శివకార్తికేయన్ (ాఱజ్ఞుఝీత్ప్రఱనెవఝుఅ) హీరోగా తెరకెక్కుతున్న తాజా సినిమా ‘ఎస్కే27’ అధికారికంగా ప్రారంభమైంది. ప్రముఖ నిర్మాణ సంస్థ సత్యజ్యోతి ఫిలింస్ ఈ చిత్రాన్ని నిర్మిస్తోంది. విమర్శకుల ప్రశంసలు పొందిన ‘పార్కింగ్’ (ఘుతీనెఱఅస్త్ర) చిత్రంతో జాతీయ అవార్డును గెలుచుకున్న టాలెంటెడ్ డైరెక్టర్ రామ్‌కుమార్ ఈ సినిమాకు దర్శకత్వం వహిస్తున్నారు. తాజాగా ఈ చిత్రానికి సంబంధించిన ప్రొడక్షన్ పనులు గ్రాండ్‌గా మొదలయ్యాయి.

# తెలుగులోకి ‘హనుమాన్ అన్ష్’.. త్రివిక్రమ్ తప్పుకోవడంతో ఇప్పుడు హోంబళే ఫిల్మ్స్ ఎంట్రీ?




హిందీ చిత్ర పరిశ్రమలో భక్తి ప్రధాన కథాంశంతో రూపొందిన కొన్ని సినిమాలు ఇటీవల భారీ విజయాలను అందుకుంటున్నాయి. అదే బాటలో ప్రేక్షకుల ముందుకు వచ్చిన ‘హనుమాన్ అన్ష్’ కూడా మంచి ఆదరణను సొంతం చేసుకుంటూ వసూళ్ల పరంగా దూసుకెళ్తున్నట్లు సమాచారం. భక్తి, పురాణ నేపథ్య అంశాలను ఆసక్తికరంగా మేళవించిన ఈ సినిమాపై ఉత్తరాది ప్రేక్షకుల్లో మంచి స్పందన కనిపించడంతో.. ఇప్పుడు దక్షిణాది భాషల్లోనూ విడుదల చేసే ప్రయత్నాలు జరుగుతున్నట్లు తెలుస్తోంది. ముఖ్యంగా తెలుగు ప్రేక్షకులకు ఈ సినిమాను అందించేందుకు తొలుత ప్రముఖ దర్శకుడు త్రివిక్రమ్ శ్రీనివాస్ ముందుకు వచ్చినట్లు వార్తలు వచ్చాయి. సినిమాకు తెలుగు డబ్బింగ్ వెర్షన్‌ను ప్రేక్షకుల ముందుకు తీసుకురావడంలో ఆయన భాగస్వామ్యం ఉండబోతుందని ప్రచారం జరిగింది. దీంతో తెలుగు ప్రేక్షకుల్లోనూ ఈ చిత్రంపై ఆసక్తి ఏర్పడింది. అయితే విడుదలకు కొన్ని రోజుల ముందు అనూహ్య పరిణామాలు చోటుచేసుకున్నట్లు తెలుస్తోంది. కొన్ని కారణాల వల్ల త్రివిక్రమ్ ఈ సినిమా తెలుగు విడుదల వ్యవహారం నుంచి తప్పుకున్నారని ప్రచారం మొదలైంది. దీంతో అసలు ‘హనుమాన్ అన్ష్’ తెలుగు ప్రేక్షకుల ముందుకు వస్తుందా లేదా అనే సందేహాలు కూడా వ్యక్తమయ్యాయి. ఇప్పుడు తాజాగా ఈ సినిమాకు సంబంధించి మరో ఆసక్తికరమైన వార్త సినీ వర్గాల్లో చక్కర్లు కొడుతోంది. దక్షిణాది ప్రేక్షకులకు సినిమాలను పరిచయం చేయడంలో ముందుండే ప్రముఖ నిర్మాణ సంస్థ హోంబళే ఫిల్మ్స్ ‘హనుమాన్ అన్ష్’ తెలుగు సహా దక్షిణాది భాషల విడుదల బాధ్యతలను తీసుకునేందుకు ఆసక్తి చూపిస్తున్నట్లు సమాచారం. అయితే దీనిపై ఇప్పటివరకు అధికారిక ప్రకటన వెలువడలేదు. హోంబళే ఫిల్మ్స్ ఈ సినిమాను దక్షిణాదిలో విడుదల చేస్తుందనే వార్త ప్రస్తుతం పరిశ్రమ వర్గాల్లో వినిపిస్తున్న ప్రచారం మాత్రమే. సంస్థ నుంచి అధికారికంగా ప్రకటన వచ్చిన తర్వాతే దీనిపై పూర్తి స్పష్టత వచ్చే అవకాశం ఉంది. హోంబళే ఫిల్మ్స్‌కు భక్తి చిత్రాల విషయంలో ఇప్పటికే అనుభవం ఉంది. ఇటీవల హిందీ నుంచి వచ్చిన ‘మహావతార్ నరసింహ’ చిత్రాన్ని కూడా దక్షిణాది ప్రేక్షకులకు చేరువ చేయడంలో సంస్థ కీలకంగా వ్యవహరించింది. ఆ సినిమా కూడా పురాణ, భక్తి నేపథ్యంతో తెరకెక్కినదే కావడంతో.. ఇప్పుడు ‘హనుమాన్ అన్ష్’ విషయంలోనూ ఇదే సంస్థ పేరు వినిపించడం ఆసక్తిని పెంచుతోంది. ఒకవేళ హోంబళే ఫిల్మ్స్ ఈ చిత్రాన్ని అధికారికంగా తీసుకుంటే.. తెలుగు, తమిళ, కన్నడ, మలయాళ భాషల్లో విడుదల చేసే అవకాశాలు ఉండొచ్చనే చర్చ జరుగుతోంది. ఇప్పటికే హిందీలో ప్రేక్షకుల నుంచి వచ్చిన స్పందన దక్షిణాదిలోనూ సినిమాకు ఉపయోగపడుతుందనే అంచనాలు వ్యక్తమవుతున్నాయి.


# మీ ప్రేమతో పాటు.. ట్రోల్స్‌ను కూడా స్వీకరిస్తున్నా: నాని



నాని హీరోగా, శ్రీకాంత్ ఓదెల దర్శకత్వంలో తెరకెక్కిన చిత్రం ‘ది ప్యారడైజ్’. గురువారం (సెప్టెంబర్ 24న) విడుదలైన ఈ సినిమాకి మిక్స్‌డ్ టాక్ వచ్చింది. కొంతమంది సినిమా బాగుందని చెబుతుంటే.. కొంతమంది తమకు నచ్చలేదని అంటున్నారు. అయితే సినిమాపై వచ్చిన రివ్యూలపై నాని స్పందించారు. సినిమాపై చూపిస్తున్న ప్రేమ, విమర్శలు రెండింటినీ స్వాగతిస్తున్నానని అన్నారు. “ది ప్యారడైజ్‌పై అభిప్రాయాలు, స్పందన అన్నింటినీ చూశా. మీరు చూపించిన ప్రేమతో పాటు, సరదా ట్రోల్స్‌ను కూడా స్వీకరిస్తున్నా. దీనిని తమ సినిమాగా ప్రేక్షకులు స్వీకరించిన తీరు నా హృదయానికి హత్తుకుంది. అదే సమయంలో సినీ విమర్శకులు, రివ్యూవర్లు ఎత్తి చూపిన పొరపాట్లు, లోటుపాట్లను పరిగణనలోకి తీసుకుంటాను. మీ అందరికీ కృతజ్ఞతలు. మీకు ప్రత్యేకమైన అనుభూతిని అందించాలనే ఉద్దేశంతో రక్తం, చెమట చిందించి #TheParadise తీర్చిదిద్దాం. మీరు దీన్ని సంబరంగా చేసుకోవచ్చు. విమర్శించవచ్చు. సినిమాపై మీరు చూపించిన ఉత్సాహం, నాపై కురిపించిన ప్రేమ, ఆప్యాయతకు నాలో కృతజ్ఞత భావాన్ని నింపాయి” అని నాని ఎక్స్‌లో పోస్ట్ చేశారు. కాగా, భారీ అంచనాల నడుమ విడుదలైన ప్యారడైజ్ చిత్రం తొలిరోజు ప్రపంచవ్యాప్తంగా రూ.88 కోట్లు వసూళ్లు చేసినట్లు చిత్ర బృందం తెలిపింది. నాని కెరీర్‌లోనే ఇవి రికార్డుస్థాయి కలెక్షన్స్ అని వెల్లడించింది.

# సైలెంట్‌గా ఒటిటిలోకి వచ్చేసిన సూపర్ హిట్ సినిమా

కొన్ని సినిమాలు ఎటువంటి అంచనాలు లేకుండా విడుదలై.. సూపర్ హిట్‌గా నిలుస్తాయి. అలా వచ్చిన సినిమానే ఇమ్రాన్ హష్మి హీరోగా నటించిన ‘ఆవారాపన్-2’. 2007లో వచ్చిన ‘ఆవారాపన్’ సినిమాకి ఇది సీక్వెల్. మొదటి భాగం సినిమాని ప్రేక్షకులు థియేటర్లలో అంతగా పట్టించుకోలేదు. కానీ, ఆ తర్వాత టివిల్లో చూసి సినిమాని ఇష్టపడ్డారు. దీంతో ఆ సినిమా సీక్వెల్‌పై ఎన్నో అంచనాలు ఏర్పడ్డాయి. అనుకున్నట్లుగానే ‘ఆవారాపన్-2’ గత నెల 14న థియేటర్లలోకి వచ్చి బ్లాక్‌బస్టర్ హిట్‌గా నిలిచింది. రూ.45 కోట్ల బడ్జెట్‌తో తెరకెక్కిన ఈ సినిమా రూ.213 కోట్ల వసూళ్లు సాధించింది. అయితే ఇప్పుడు ఈ సినిమా సైలెంట్‌గా ఒటిటిలోకి వచ్చేసింది. అమెజాన్ ప్రైమ్‌లో అద్దె విధానంలో అందుబాటులోకి వచ్చింది. త్వరలో ఉచితంగానూ స్ట్రీమింగ్‌లోకి రావచ్చు. హిందీలో మాత్రమే ఇది అందుబాటులో ఉంది.



# ‘అనుమాన పక్షి’ రివ్యూ.. విమల్ కృష్ణ టేకింగ్, రాగ్ మయూర్ నటన ఎలా ఉంది!




డిజె టిల్లు’ వంటి సెన్సేషనల్ బ్లాక్‌బస్టర్ తర్వాత దర్శకుడు విమల్ కృష్ణ తెరకెక్కించిన తాజా చిత్రం ‘అనుమాన పక్షి’. డిఫరెంట్ కాన్సెప్ట్‌తో ప్రేక్షకుల ముందుకు వచ్చిన ఈ సినిమా కథాకథనాలు ఎలా ఉన్నాయో సమీక్షలో చూద్దాం. కథేంటంటే: సన్నీ (రాగ్ మయూర్) ‘అనుమాన పక్షి’ పేరుతో ఓ యూట్యూబ్ ఛానెల్ నడుపుతుంటాడు. ప్రతి విషయాన్ని అతిగా ఆలోచించడం, అందరినీ అనుమానించడం అతని నైజం. ఈ క్రమంలో తన స్నేహితుడు అనంతు డిప్రెషన్‌లో ఉన్నానని, కాశ్మీర్‌లో ఆత్మహత్య చేసుకుంటానని ఫోన్ చేస్తాడు. దాంతో సన్నీ, రమ్య అనే అమ్మాయిని ఇష్టపడే వర్మ (ప్రిన్స్) సహాయంతో కాశ్మీర్ బయలుదేరుతాడు. అక్కడ కన్య (మెరిన్ ఫిలిప్) పరిచయమవ్వడం, అనుకోకుండా వర్మ హత్యకు గురికావడం, రీల్స్ చేయడానికి పిచ్చిగా ప్రయత్నించే పోలీస్ ఆఫీసర్ వాసు (అజయ్) ఎంట్రీ ఇవ్వడం జరుగుతుంది. వీరందరి మధ్య సంబంధం ఏమిటి? ఈ చిక్కుముడిని సన్నీ ఎలా విప్పాడు? అనేదే ఈ చిత్ర అసలు కథ. విశ్లేషణ: దర్శకుడు విమల్ కృష్ణ ఎంచుకున్న పాయింట్ చాలా కొత్తగా ఉంది. ప్రతి చిన్న విషయానికి అనుమానపడే హీరో పాత్ర చుట్టూ తిరిగే సన్నివేశాలు విభిన్నంగా నవ్విస్తాయి. ప్రథమార్ధంలో హీరో చేసే అల్లరి, సిచ్యుయేషనల్ కామెడీ ప్రేక్షకులను ఆకట్టుకుంటుంది. ఇక ద్వితీయార్ధంలో అజయ్ పోలీస్ ఆఫీసర్‌గా చేసిన హంగామా, రీల్స్ కాన్సెప్ట్ ప్రస్తుత ట్రెండ్‌కు తగ్గట్టుగా సరదాగా సాగుతాయి. స్క్రీన్‌ప్లేలో సస్పెన్స్ ఎలిమెంట్స్ సినిమాపై ఆసక్తిని కలిగిస్తాయి. నటీనటుల ప్రతిభ: లీడ్ రోల్ చేసిన రాగ్ మయూర్ తన అనుమానాలతో కూడిన పాత్రలో చాలా సహజంగా నటించాడు.

"MANA VISHWAM" vide PRGI Registration No. "TGTEL/26/A4450" Printed by SRI VENKATESWARA PRINTING SOLUTIONS, Published by Nameendla Pramod on behalf of Nameendla Pramod, printed at 11-1/B/42, BPM GREEN LANDS COLONY, PRVATHAPUR, MEDIPALLY MANDAL AND DIVISION, GHMC, MEDCHAL MALKAJGIRI, TELANGANA - 500098 and published at H No 2-96, Geesugonda, Gorrekunta editor Nameendla Pramod. Gmail- manavishwamtelugudaily@gmail.com, Cell- 6305638569